గెలుపు గెలుపు

ఓటమి

www.vaaradionline.com

గాయాలూ గేయాలూ

రచన

ఆరుద్ర

స్రీ శక్తి ప్రచురణలు

304, శ్రీ సాయి అపార్ట్‌మెంట్స్, ఓల్డ్ ఆర్.టి.ఎ. రోడ్, అస్మాన్‌గడ్

న్యూ మలక్‌పేట, హైదరాబాద్-500 036. ఫోన్ : 91-040-24162885

గాయాలూ గేయాలూ

© కె. రామలక్ష్మి

తొలి ముద్రణ : 1957
ఈ ముద్రణ : 2007

వెల : రూ.**120/-**

ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
విజ్ఞాన్ భవన్, బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్ - 500001.

ముఖచిత్రం
బాపు

డి.టి.పి
అనురాధా రఘురామ్
ఫోన్ : 040-27621155/9441186831

ప్రింటర్స్
హైటెక్ ప్రింటర్స్
గాంధీనగర్, హైదరాబాద్.

www.vaaradhionline.com

నా

జీవనారామలక్ష్మి

కి

నా మాట

నేను గాయాలూ గేయాలూ తిరిగి అచ్చువేయించాలని నిర్ణయించాక దీనికి పరిచయ వాక్యాలు ఎవరు రాయాలి? అసలు ఎవరిచేతనేనా రాయించాలా అన్న మీమాంసలో పడ్డాను. తరవాత – నేనే ఒక నిర్ణయానికి వచ్చి – మేం వివాహం చేసుకున్నాక నాకు ఆరుద్ర రాసిన ఈ లేఖను ప్రచురించాలని నిర్ణయించాను. కారణం ప్రత్యేకంగా ఏమీలేదు. ఆరుద్ర తన మనసులోని మాటలను, దాచుకున్న భావాలను దీనిలో బయటపెట్టడం జరిగింది. ఇది 1955 ఆగస్టు లేఖ.

శ్రీశ్రీకి బాగా చదువుకున్న స్త్రీల సాన్నిహిత్యం అంతగా యిష్టం వుండేది కాదు. వాదనకి దిగితే లేచి వెళ్లిపోయేవాడు. సంప్రదాయక బ్రాహ్మణ వధువును ఆరుద్ర చేసుకోవాలని అతని కోరిక. ఆయనగారి శ్రీమతి రమణమ్మగారు అలాంటి మహిళ. మా మామగారికి, అన్నా రుద్రకి కూడా శ్రీశ్రీ ఆరుద్ర పెళ్లి గురించి సూచనలు చేశాడు. కాని అవేం కుదరలేదు. నావల్ల ఆరుద్రకి తిండి సుఖం కూడా ఉండదని బాధపడ్డాడు. కారణం నేనెప్పుడూ ఇప్పటిదాకా వంటావార్పూ చేయలేదు. నేర్చుకోనూ లేదు. పాపం మహాకవికి ఆరుద్రపై చాలా అభిమానం వుండేది. సాన్నిహిత్యం వుండేది. వీటిని నావంటి తెలివైన ఆడది పాడు చేస్తుందని ఆలోచించాడు.

నాకు శ్రీశ్రీపై కోపం లేదు. నేను అతని తరహా మగవారిని గౌరవించలేను. 'నా సాహిత్యం చదవండి. మెచ్చుకోండి. నా వ్యక్తిగత జీవితం జోలికి రాకండి' అనే మేధావులని ఎలా గౌరవించడం? నాకు తెలియదు.

ఇదే – శ్రీశ్రీ బ్రతికి వున్నన్నాళ్లూ నన్ను దూరంగా వుంచిన విషయం. ఆరుద్రకోసం కూడా నేను నా మనసుకు నచ్చని విషయాలు నచ్చినట్టు నటించలేదు. బహుశ నా యీ దృక్పథం మా బంధాన్ని చాలా పటిష్ఠం చేసిందని నేను నమ్ముతున్నాను.

ఈ విషయం ఇప్పటికేనా చెప్పాలని అనిపించింది. ఎందుకంటే శ్రీశ్రీ భక్త కోటి నన్ను ఎప్పుడూ అతని శత్రువుగానే చూస్తూ వచ్చారు. ఆ అపోహను ఇన్నాళ్లకేనా ఇన్నేళ్లకేనా తొలగించకల్గే అవకాశం వచ్చినందుకు ఆనందంగానే వుంది.

గాయాలూ గేయాలూ 1957లో ప్రచురణ జరిగింది. ఇప్పుడే జూన్ 4న అతని జ్ఞాపకార్థం యీ కొత్త ముద్రణను చేపట్టాను. దీనిలో చాలా పాటలు చేర్చే ప్రయత్నం కూడా చేశాను. ఇంకా వుండాలి. కాని సేకరించలేకపోయాను. మీరు ఈ సంకలనం ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

భవదీయురాలు

కె. కామేశ్వరి

8-8-1955

సేలం

డియరెస్ట్

కనీసం సోమవారం నాటికైనా నీకు జాబు వస్తుందని ఆశించావు. రాయలేకపోయాను. క్షమించు. ఉత్తరం రాద్దామని ఏరోజుకారోజు అనుకోడంగాని ఉత్తరంతోపాటు ప్రజామతకి పద్యాలు కూడా పంపిస్తాను అని చెప్పానుగా. అలా చెప్పినట్టు చేయడానికి ముందు పద్యాలు రాయడం మొదలెట్టా కూడా. పద్యాలు తయారవక అసలు ఉత్తరమే వాయిదా పడడం మొదలెట్టింది. అందుకే పద్యాలు పంపకుండా వుత్తరం ఒక్కటే రాస్తున్నాను.

మన పెళ్లి అయాక నా కవిత్వానికి కూడా కొత్తరంగు, అనుబంధం బాధ్యత మొదలైనవి వచ్చాయి అనుకుంటాను. పూర్వం ఎంత మామ్మూలు భావాన్నైనా ఉబికే ఉడుకుడుకు మాటలలో చెప్తూ వుండేవాడిని. ఇప్పుడు ఎంత తీవ్రమైన దానినైనా, ఎంత ఘాటైన సంగతైనా లలితలలిత పదాలలో తేనెగా తేలికగా చెప్పడం జరుగుతూంది. నీకు వినిపించబోయే పద్యాలు తీవ్రతని విడనాడిన తీక్ష్ణ పద్యాలు. ఇప్పుడు నాకు కృష్ణశాస్త్రికీ శ్రీశ్రీకీ తేడా బాగా అనుభవంలో తెలుస్తున్నాది. కృష్ణశాస్త్రి గత దశాబ్దంలో శ్రీశ్రీ భావాలనే కొన్నిపాటలుగా రాశాడు. వాటిలో తుపాకి నాదం ఏదీ?

"ఆకాశపు నొసట పొడిచె
అరుణారుణ తార"

అన్న భావాన్ని శ్రీశ్రీ యింత లలితంగా చెప్తాడా? నాలుగు సీమ టపాకాయల గుత్తుని రెండు పాదాలలో పేలుస్తాడు. అదే శ్రీశ్రీ గొప్పతనం! నారాయణబాబు శ్రీశ్రీ సరంజామానే తన పద్యాలలో వాడుకున్నాడు. అయితే శ్రీశ్రీయొక్క వేగం శ్రీశ్రీ ఛందస్సులోనే కనిపిస్తుంది. ఆ సామగ్రే యింకో కవి

వాడితే కుంటుతాయి. శ్రీశ్రీ 'ఎగరేసిన ఎర్రబావుటా రుద్రాలిక నయన జ్యోతిక కలకత్తా కాళిక నాలిక కావాలోయ్ నవ కవనానికి' అన్నాడు. నారాయణబాబు 'రక్త పతాకం శక్తి నాలిక, ఆకసమున మునిమాపు' అని అంటే – 'తీవ్రత వూహించుకుంటేగాని రాదు. సామగ్రి ఒకటే. కొన్ని పత్రికలలో 'అయిదు రూపాయిలకి అరవై నాలుగు వస్తువులు' అనో, ఆ మాదిరిగానో ప్రకటనలు కనబడుతూ వుంటాయి. ప్రకటన బాగుంటుంది. వస్తువులు కొనుక్కుని చూస్తే నిరుపయోగం. అదే శ్రీశ్రీ సామగ్రి. శ్రీశ్రీ ఎవరిని ఇమిటేట్ చేసినా అది తన సొంతం అని సంతకంలో రుజువు చెయ్యకలడు. నిజమైన కవి సంతకం 'పాద పాదంబున పరగుచుండు' కృష్ణశాస్త్రి రాసిన వాటిలో చాలా బాగున్న 'కాలమే పసిపాప' మొదలైన ఊర్వశిలోంచి శ్రీశ్రీ ఎంతో నేర్చుకున్నాడు. 'ఆనందం అర్ణవమైతే' అనేది స్విన్ బర్న్‌కి కృతజ్ఞతలతో ప్రకటించాడు. అందులోనూ కృష్ణశాస్త్రి ఊర్వశి కూడా నాకు కనబడింది.

మున్నీటి తరగలకు
మిన్నేటి నురుగులకు
తడయు నెడబాటేనె
విడని కౌగిలి నేనె

మొదలైన పాదాలూ,

నీ ఎగిరిన జీవవిహంగం
నా పగిలిన మరణమృదంగం
చితులుంచిన చోటులలోనో
చిగురించే తోటలలోనో
వలయములై చెలించినపుడే
విలయములై జ్వలించినపుడే....

అన్న శ్రీశ్రీ పాదాలతోపాటు జ్ఞాపకం చేసుకోకుండా వుండలేను. అయితే శ్రీశ్రీ ప్రథమశ్రేణి కవి కనుక మహాకవిగా నిలబడ్డాడు. కృష్ణశాస్త్రి అనిపించుకున్నాడు. తక్కినవారికి అనిపించుకుందామన్న ఉబలాటంవున్నా అందుకు తగరు.

నీకు ఎన్నెన్నో విషయాలు రాద్దామని ఉత్తరం మొదలుపెడితే కవిత్వం గొడవలు వస్తున్నాయి. 'కవిత్వంగాని, దాన్ని గురించి చర్చగాని రమ్మనప్పుడు రాదు. పొమ్మన్నప్పుడు పోదు. చెడ్డ చికే్క! మన పెళ్లికి ముందు ఇద్దరం కలిసి తిరిగినరోజుల్లో "పొమ్మంటే కవిత్వం పోదే. ఎన్ని పద్యాలు రాయకుండా రచించాను! చిత్రం! అవన్నీ పాత వృత్తాలలో రాసినవే. జ్ఞాపకం వుందా? ఒకనాడు నీవు ఇంటికి వస్తానని రాకపోతే నీకు ఉత్తరం పద్యాలలో శార్దూల మత్తేభాలలో రాశాను. నా భావాలని నవీన ఛందస్సులలో చెప్పాలనే, సంస్కృతం సాధ్యమైనంత వరకూ మారువేషంలో కూడా రాకుండా జాగ్రత్తపడుతూ పద్యాలు చెప్పాలని నా ఆశ. అందుకే నా వ్యక్తిగత భావాలు కూడా చాలా ప్రెయివేటువి వృత్తాలలో రావడం నాకు ఇష్టంలేదు. వచ్చేశాయి. ఏం చేస్తాను.

మన సన్నిహిత స్నేహానికి నా ప్రేమగీతాలే కారణం. నువ్వుగాని "మీరెందుకు యీమధ్య ప్రేమగీతాలు రాస్తున్నా"రని ఆ రాత్రి మనం బీచికి వెడుతున్నప్పుడు అక్కడలా అడక్కపోతే....? ఎంత అదృష్టం పోగొట్టుకునేవాణ్ణి. ఎంత సంపూర్ణతని అనుభవించగలిగే అవకాశం వదులుకునే వాడిని. మైడియర్ డియర్ గాళ్, నువ్వుగాని నా జీవితంలోకి కిందటేడు ప్రవేశించకపోతే యీ సంవత్సరం ఫిబ్రవరి మాసంలో ఏమయ్యేవాడినో.

తలచుకొంటే నేనే ఇంత అగ్నివర్షంలో భగ్న హృదయంతో, ఆ నెలనెలంతా నిప్పులమీద నడుస్తూ నిట్టూర్పులు విడుస్తూ, నిరాశ ధరిస్తూ ఆశకోసం ఆనందం కోసం జీవించాను అనిపిస్తున్నది. ఒకపక్క శ్రీశ్రీ అక్కడ మెంటల్ క్లినిక్‌లో. ఇంకోపక్క నువ్వు మంచాన టైఫాయిడ్‌తో. ఆ నెలంతా నేను ఎలా లాగానో ఎంత అలసిపోయానో యిప్పుడు తెలుస్తున్నది. ఆరోజుల్లో

నువ్వు నా జీవితాన్ని పెనవేసుకొని ఉండకపోతే శ్రీశ్రీ గురించి ఆలోచనతో నేనుకూడా నరాలు తెగినవాణ్ణి అయి వుందును. నీవు మంచాన వున్నావు అన్న ఆందోళనే శ్రీశ్రీ గురించి నాకున్న ఆందోళనతో పోరాడింది. నువ్వు నాకు కావాలి. నువ్వు నాదానివి కావాలన్న తహతహ నన్ను 'పిచ్చివాణ్ణి కాబోయే దుర్ఘటన నుండి కాపాడింది. నీకోసం నా తెలివితేటల్ని, మెదడుని అదుపులో పెట్టుకున్నాను. అందుకే శ్రీశ్రీ విషయంలో అంత ముందు జాగ్రత్త తీసుకొనడం జరిగింది. శ్రీశ్రీ మేధ ఆంధ్రదేశానికి మళ్లా దొరకడానికి కారణమైన చికిత్సకి నేను ఏవిధంగా తోడ్పడినా ఆ తోడ్పాటుకి నీమీది నా ప్రేమే కారణం. నువ్వొకత్తెవి గమ్యస్థానంగా నాకు లేకపోతే శ్రీశ్రీ పత్రికా సమరంలో క్షతగాత్రుడై షెల్ షాక్ పొందినవాడై నా చేతులలోకి వచ్చినప్పుడు నేను ఎంత సాహసం చేసేవాడినో, ఎంత చితికిపోయేవాడినో?

శ్రీశ్రీ నా జీవితానికి వరవడి పెట్టినవాడు. చేయూత ఇచ్చినవాడు. ఆప్తమిత్రుడు, గురువు, చెలికాడు, సహపాఠి. కట్టుతప్పిన చిన్నకుర్రాడు అన్నీని. గత పదేళ్లుగా సాహిత్య జీవనంలోనే కాదు నిత్య జీవితంలో కూడా ఒకరి పక్కన ఒకరు వుంటూ వచ్చాం. అతడు మార్గదర్శి. నేను సహచరుణ్ణి. అతడు అగ్రగామి. నేను అనునాయుని. అతడు సాహసికుడు. నేను సహచరుణ్ణి. అతడు తొందర మనిషి. నేను ఆపే యువకుడిని. నేను దూకుడు కుర్రాడిని. అతడు సలహా చెప్పే పెద్ద. అతడు నాకన్నా పదిహేడేళ్లు పెద్ద అయినా ఇద్దరం మిత్రుల్లాగా చరిస్తున్నాం. నాకు పదేళ్లు వచ్చేదాకా మా నాన్నా శ్రీశ్రీ అంత అన్యోన్యంగా వుండేవాళ్లు. ఇద్దరూ ఒక కంచాన తిని, ఒక మంచాన పడుకున్న బాల్యమిత్రులు బంధువులు. బావమరుదులు. ఇప్పటికి మా నాన్నని శ్రీశ్రీ 'పెదబావగాడు' అని పిలుస్తాడు. ఇద్దరూ ఒక పుస్తకాన్నే కొనేవారు. ఇద్దరి పేర్లూ దానిమీద రాసుకునేవారు. కలిసి చదువుకొనేవారు. అలా వాళ్లిద్దరూ అలా చదువుకొన్న పుస్తకాలని ప్రబంధాలని నా చిన్నతనంలో నేను చూచాను. దాచాను. చదివాను (బోధపడకపోయినా వంటబట్టాయి). అటువంటి శ్రీశ్రీ

పక్కన నేను ఉండకుండా వుండడం సంభవించింది. నేను బెజవాడ వెళ్లలేదని తెలిసి మొన్న ఒకటవ తారీఖున మద్రాసులో ఎంతమంది ఆశ్చర్యపడ్డారు.

సరే, సాహిత్య జీవనంలోనే కాక మనపెళ్లికి శ్రీశ్రీయే కారకుడు. శ్రీశ్రీ ఎగసన త్రోయకపోతే – నాలోని ప్రణయజ్యోతి వెలిగేది కాదేమో. సరిగ్గా ఒక్క సంవత్సరం క్రిందట సాయంత్రం ఇద్దరం ఒకచోట కూర్చున్నాం. మా ఇద్దరి నరాలు కొద్దిగా నునువెచ్చగా వున్నాయి. మెదడు చల్లని చీకట్లో చలి కాచుకుంటున్నాది. అప్పుడు శ్రీశ్రీ 'అబ్బీ, నీ పెళ్లి ఎప్పుడు? ఎందుకాలస్యం చేస్తావు?' అన్నాడు. నా జీవిత భాగస్వామిని నేనింకా పూర్తిగా నిర్ణయించుకోలేదు. కాని అతడే వూహించాడు. "అందం లేనిది. చదువుకున్నది – నీతో స్విన్ బర్న్‌నీ సారోయిన్‌నీ చర్చించే తెలివి ఎక్కువగల స్త్రీ సుఖం ఇవ్వదు అబ్బీ – ఆలోచించి అడుగెయ్" అన్నాడు. నాకు ఏం చెప్పాలో అర్థంకాలేదు. కాని శ్రీశ్రీ నన్ను పెళ్లిచేసుకోమనడం చూచాయగా నా మనసులో ఎవరున్నదీ గ్రహించడం నాలో అజ్ఞాతంగా వున్న ఆకాంక్షని రేపింది. శ్రీశ్రీ దృష్టి ఆడదాని విషయంలో వేరు... అప్పటికింకా నేను నిర్ణయించుకోలేదు. నేను నిన్ను ఆకర్షిస్తున్నట్టే, నువ్వూ నన్ను ఆకర్షిస్తూనే వున్నావు. అడపా తడపా పద్యాలు రాయించుతున్నావు. అంతే. అనురాగాన్ని అంతా పద్యాలలో ఒలకపోసి, అంతకుమించి ప్రణయాన్ని ప్రయత్నించకపోవడమే నా పోలసీ అప్పటికి. ఆ శ్రీశ్రీ వేసిన ప్రశ్న నేను రాసిన మంచి రేడియో నాటికకు కారణం అయింది. 'సీతాకోకచిలుక'. ఆ మానసిక పరిస్థితిలో రాశాను. హీరోని నేనే. తండ్రి శ్రీశ్రీ. నలుగురమ్మాయిలు. (అన్నట్టు జేమ్స్ జాయిస్ పాత్రలు – స్టీవెన్ డిడలాస్‌కు పాల్టు బ్లూమ్ ఎలా ఆధ్యాత్మిక తండ్రో శ్రీశ్రీ నాకు సాహిత్య ఆధ్యాత్మిక పితృదేవుడు) నేను ఎంచుకొన్న పిల్ల నా గొంగళిపురుగు. నువ్వు అయ్యేవు. ఈ ఉత్తరం చదివాక సీతాకోకచిలుక మళ్లా చదువు. నా ప్రేమ నా బాధ అర్థం అవుతుంది. శ్రీశ్రీకి తెలియదు నాకు తెలుసు నువ్వు నా సాహచర్యంలో నా జీవితంలో సీతాకోకచిలుకవు అవుతావు. అయ్యావు.

ఆ నాటిక రాయకముందింకా నా ప్రేమగీతాలలో నేను ఎవరినీ వరించలేదనుకునేవాడిని. 'ఎవరేనా తోడురండి జీవితాన్ని పంచుకోండి' అని అర్థించాను. కమనుడెవ్వడు నీ రమణుడెవ్వడు? చెలి తప్తహృదిలో దీర్ఘసుప్త వాంఛకు శమనమెన్నడు? సుఖశయనమెన్నడు? అని ప్రశ్నించానుగాని ఎవరో తేల్చి చెప్పుకోలేదు. సీతాకోక చిలుకలో నా హృదయం యాపిల్‌పండును మలాకా జాంపండును నా ప్రేమఫలంగా అర్పించాను. వరించేను. శ్రీశ్రీ సూచన కాదు. నువ్వే నాకు అవసరం అనిపించింది. అందుకే ఆ నాటిక పూర్తయ్యేక నిన్ను తరుచు కలుసుకోవడం, నీతో నడవడం నిన్ను చూడ్డానికి తహతహలాడడం జరిగింది. మనం ప్రేమించుకుంటున్నామని అందరికీ తెలిసినా – మనిద్దరం ఒకరికొకరం చెప్పుకోవడం కూడా అయ్యాక శ్రీశ్రీకి చెప్పాను. కాస్త బాధగానే ఆనందం వ్యక్తం చేశాడు. అటువంటి శ్రీశ్రీ మన పెళ్లిపత్రాలమీద సాక్షి సంతకం పెట్టడం మన పెళ్లికేగాక ప్రేమకి కూడా సాక్ష్యం ఇవ్వడం.

ఇప్పుడు రాత్రి 12.30 అయింది. పడుకొంటే నిద్రపడుతుందని నమ్మకం లేదు. నీకు ఇవాళ ఈ ఉత్తరం పోస్టు చేయలేకపోయానే అన్న బాధ పట్టుకుని గిల్లుతోంది. ఎన్నో క్షమార్పణలు ముందుకొస్తున్నాయి. భావకవుల పద్యాలు ప్రణయగీతాలు పొడుచుకొస్తున్నాయి. నాముందు టేబిల్‌మీద 'వైతాళికులు' పడుక్కొన్నారు. వాళ్ల వినబడని గొంతుకలు ఎలుగెత్తుతున్నాయి.

ఈ నడిరేయి, వెన్నెల యెద చలించు
పిలుపేదో 'నా సఖా' అని వేగిరించు
అనలమై కాల్చు నిశ్శబ్దమునె కలంచి
పరువు లెత్తించు కడల నా బ్రతుకునిపుడు

నా కొరకె చూడు సఖి కంఠనాళమందు
మ్రోగక చలించి చెరవడ్డ మూగబాధ

ఎటు పిలుచు నన్ను ఆ చూపుటిరుల క నువె
పలుక నేరక విడివిడి పగులు నెమొ

శ్రీశ్రీ నన్ను ఎంత వూపినా ఈ కృష్ణశాస్త్రి మరుపురాడు. ఎంత నిజంగా అబద్ధాలు రాశాడు. అతడు ఇంత బాధపడ్డాడో లేదో యువతీ యువకులకి బోలెడంత భావరాశిని ఇచ్చేడు. ఈ 'నడికిరేయి' నాకు అనిపించే భావాలు ఎన్నాళ్ల కిందటో చెప్పాడు. కవి – ఈ భావాలు ఇప్పుడు నావైనా నేను వాటిని పద్యాలుగా రాయను. నాలో ప్రేమానుభూతులు పైకి వచ్చినప్పుడు పాతకవులని భావకవులని పిలచుకొంటాను. వాళ్ల పద్యాలు జ్ఞాపకం రాకపోతే, అందుబాటులో లేకపోతే అప్పుడు రాస్తాను ప్రణయగీతులు. అలా రాసినవే ఇప్పటిదాకా ప్రచురింపబడినవి.

నేను ఎప్పుడొస్తావని ప్రశ్నించావు. ఎప్పుడెప్పుడా అని నేనూ ఎదురుచూస్తున్నాను. బహుశా కిందటి ఉత్తరంలాగా ఇది కూడా నేను యింటికి వచ్చిన తరువాతే అందుతుందేమో. నా తహతహ నీకు ఎలాగ చెప్పాలను కుంటూంటే కాటూరి మేష్టారి పద్యం (పింగళి మాస్టారి సంతకంతో కూడా) ఎగిరివచ్చింది.

ఎగిరి నీ పాదముల చెంతకెట్లో వచ్చి
వ్రాలుదునోయన్న ఉత్సుకత్వమ్ము కలదు
సాధ్యసాధనమైన పక్షముల జంట

హృదయమున కుండి లేదు శరీరమునకు – అయినా ఎగిరి ఎల్లుండి వాలుతాను. ఇది నాకు సరికొత్త అనుభవం. నా జీవితంలో ఇప్పటికి ఎన్నిసార్లు ఉన్న వూరు వదలి గ్రామాంతరాలు వెళ్లాను. గాని కొత్త వూరు చేరగానే ఉత్తరం రాయవలసిన తహతహ అవసరం, ఎంత వేగంగా ఇక్కడి పని పూర్తిచేసుకుని ఇల్లు చేరుకుందామా అనే ఆత్రుత పూర్వం లేవు. నేను ప్రస్తుతం

నూరుయోజనాలు తాడుకట్టుకుని ప్రపంచ మైదానంలో మేస్తూన్న పెంపుడు జంతువులాగ ఉన్నాను. ఎంతదూరం వెళ్లినా రాటకు కట్టుబడేవుంటాను. ఈ అనుబంధానికి నీకు నా కృతజ్ఞత. డొల్లగా వున్న జీవితంలో యీ అనుబంధం రాగానే ఎంత వెలుతురు! ఎంత ఆశ! ఎంత మంచి!

ఎలా వున్నావు? నాకు తెలుసు – అలాగే – వుంటావు. కొద్దిగా కోపం. హెచ్చుగా ఆత్రం. రాలేదని బాధ. వస్తున్నానని ఆనందం. వస్తా. ఎన్నో విషయాలు మాట్లాడుకొందాం. ముద్దుగా యథావిధిగా పోట్లాడుకొందాం. కలిసి ఒకటౌదాం.

with lots and lots of love
Yours forever

(ఈ లేఖ ఫోటో కాపీ ప్రచురించాలని ప్రయత్నించాను. కాని మరీ ఏభయిరెండు సంవత్సరాల కాగితం కావడంతో రాలేదు.)

విషయసూచిక

1.	ప్రేమ గీతం	23
2.	కనులు మాటలాడు	24
3.	నీవు నన్ను	25
4.	ప్రియురాలి తొలిలేఖ	26
5.	అజేయుడి అనురాగం	27
6.	ఎవరినీ ప్రేమించకు	29
7.	అయ్యోరామ	30
8.	కన్నుల నిద్దర	32
9.	పేరంటము	33
10.	పదుచుదనం రైలుబండి	34
11.	ఎంచక్కని కల	35
12.	పదును వానజల్లు	40
13.	కడుదూరం	41
14.	ఆకాశవీధిలో	42
15.	ఈ చల్లని రేయి	43
16.	మంచి మనసును	44

17. ఎదలో ఏదో 45
18. ఈదలేనోయీ 46
19. ఎవరు కన్నారు? 47
20. పిల్లనగ్రోవిని 48
21. వాడే చోరుడే 50
22. ఎవరేమన్నా 51
23. జాళువా విరాళి 52
24. ఎడబాటు 54
25. శోకాల బాకాలు 56
26. వచ్చేను వచ్చేను 58
27. అడియాస 60
28. ఒక్కా ఓ చెలియా 61
29. రొండూ రోకళ్లూ 63
30. మూడూ ముచ్చెలుకా 65
31. నాలుగు నందన్నా 67
32. అయిదూ చిటిగొలుసూ 69
33. ఆరుం దారాలు 71
34. ఏడుం బేడీలు 73
35. ఎనిమిది మనమందా 75
36. తొమ్మిది తోకుచ్చు 77

37. పదీ పట్టేడా 79
38. చూశావా 81
39. ఇంత సిగ్గేలనే 82
40. అపరాధమేదేని 84
41. నిందాస్తుతి 85
42. పొంగింది యమున 86
43. విరబూసి నవ్వింది 87
44. అదే ఆమని 88
45. ప్రణయదృష్టి 90
46. నీ చిరునామా ఏమి? 91
47. ఆకాశం ఎంత ఎత్తు? 92
48. ఆషాఢ మేఘం 93
49. ఫక్కున నవ్వు 94
50. గోపాలదేవుడా 95
51. ఔనా? 96
52. ఆ..ఆ..ఆరుద్ర..గీ.గీ.గీతం 97
53. ఎడబాటు కాటు 1 99
54. ఎడబాటు కాటు 2 100
55. రామ..లక్ష్మీ 102
56. ఎవరేమన్నా ఏమనుకున్నా చంద్రా ఆగకు 103

57. వేదంలా గోదావరి 104
58. ఆడిందే ఆట 106
59. తూరుపుదిక్కున 108
60. విజయీభవ 109
61. ఇన్నాళ్లకు మానవుడే 110
62. నిరంతరం 111
63. పుట్టాడు అమరజీవి 112
64. తెలుగుపాటకి 113
65. ఎందుకింత సంతోషం 114
66. జాజీరి 115
67. మాతృకాంక్ష 116
68. తేనెకన్న మధురం 124
69. ఆలపించు 125

ప్రేమగీతం

ప్రేయసీ నీ కొరకు నా రక్త మెలుగెత్తి
యుప్పొంగి పాడంగ మొదలాడు
నందుకే "అందుకే"యను ప్రేమవృక్షాలపై
నెక్కి "కాబట్టి" పుష్పాలు కోసుకొని వచ్చాను
పుష్పలావికలమ్ము పూలచెండులకన్న
భాష్పధారల పెరుగు వేదనాలతలపై
విరియబూచిన వేడినిట్టూర్పులే నీదు
చీకట్ల కురులలో సింగార మొలికించు
నందుకే "అందుకే"యను నాదుబాధాగ్రముల
నెక్కి ప్రేయసీ నా రక్త మెలుగెత్తు!

కనులు మాటలాడు....

కనులు మాటలాడు భాష వేరే ఉన్నదిలే
మనసు తెలియచేయుటకది బలే సులువులే

బెదురుచూపులోన కలదు చెదరని బ్యూటీ
మొదటి ప్రేమలో వచ్చుట దానికి డ్యూటీ

ఓరచూపులో ఉన్నది ఎంతో మీనింగు
కోరచూపులో ఉండును ఆఖరి వార్నింగు
కంటిలోన చదువవచ్చు కన్నియ మొహబత్తు – సై
లంటుగ మ్రోగును చెలిచూపులనౌబత్తు

నీవు నన్ను

నీవు నన్ను ప్రేమిస్తే సగం జగం వీడిదే.
నీవు నన్ను కాదంటే జగమంతా బూడిదే

నిన్ను తప్ప నా కన్ను ఇంకేదీ చూడదే
నీవు నన్ను విరహంతో బాధపెట్టకూడదే

నీతో ఆ పాతాళం నా పాలిటి స్వర్గమే
నీవులేని వైకుంఠం పాడుపడిన దుర్గమే

నీవు నన్ను వలదన్నా ప్రేమ నిను వీడదే
నీవు నన్ను విడిచినచో నాకు ఊపిరాడదే

ప్రియురాలి తొలిలేఖ....

ప్రియురాలి తొలిలేఖ
ఇరులలో ఇనరేఖ
ప్రియురాలు దరిలేక
ముసురు చీకటిమూక

ముఖారి రాగాన
చిటారు స్థాయి
ముఖమెడమయిన
తొలి చలి రేయి

అజేయుడి అనురాగం....

తుడుచుకో కన్నీళ్ళు
ముడుచుకో అరవిరులు
నడచి వస్తున్నాడు
కడకు నీ విభుడు
ఇది కొత్త ఏడాది
ఈ కాన్క నీది
జడలోన మల్లియలు
దడహెచ్చు గుండియలు
విడని కౌగిలిలోన
పుడమి నా కాదలి
ఇది కొత్త ఏడాది
ఈ వలపు మనది
కడలిలో ముత్యమై
అడవిలో వెన్నెలై
ఒడలు పులకించగా
సుడులు తిరిగే సొగసు

ఇది కొత్త ఏడాది
ఈ హొయలు నీది

పొడవకూడదు పొద్దు
విడవకూడదు మత్తు
పడకటింట్లో వెలుగు
నడవలో వైదొలగు

ఇది కొత్త ఏడాది
కల కాటి బూది

www.vaaradhionline.com

ఎవరినీ ప్రేమించకు

ఎవరినీ ప్రేమించకు
ఎవరికీ మనసీయకు

నీ బాధలెవరికీ తెలుపకు
విని నవ్వు నీ లోకము
మనసులోనే ఉంచుకో
మరులు కలిగె విచారానికే

కన్నీళ్ళు ఇంక తుడవకు
తుడిచినా మరల కారును
కన్నీటిలో కరిగిపో
కలిగె మరులు వియోగానికే

అయ్యోరామ....

సిగ్గులు చిగురించెనే
బుగ్గలు ఎరుపెక్కెనే
కన్నులు బరువెక్కెనే
కారణాలు తెలుపవే

అయ్యోరామ అయ్యోరామ
అదే తొలిప్రేమ
అదే తొలిప్రేమ
తెలుసుకోవె భామా

పేరు పలుకబోతే నా
పెదివి అదిరెనే
తిన్నగా చూసేందుకు
కన్ను బెదిరెనే

అయ్యోరామ....

అతనితో గడిపినట్టి
దినమే ఒక క్షణము
అతనులేని క్షణమైన

అదియే ఒక యుగము
అయ్యోరామ....

చీమ చిటుకుమనినా
తానే అనిపించు
ఏమిటమ్మ ప్రేమ
ఈ భువినే మరపించు
అయ్యోరామ....

www.vaaradhionline.com

కన్నుల నిద్దర....

కన్నుల నిద్దర రాకపోతే
పడ్డావనుకో ప్రేమలో
తిన్నది హితవే కాకపోతే
పడ్డావనుకో ప్రేమలో

అడుగులు తడబడి మాటలు పొరబడి
గుండెల దడదడ హెచ్చితే
పదహారేళ్ళు దాటిన కన్నియ
ఎదలో సూదులు గుచ్చితే
పడ్డావనుకో ప్రేమలో...

విరహములోపడి
వేదనలోచెడి, నీ
దేహముచిక్కి, సగమైతే
కన్నీరే నీలో చెరువైతే
పడ్డావనుకో ప్రేమలో....

పేరంటము....

పిలిచింది పిలిచింది పేరంటమున కామె
కనుగోన లందున కదలాడు నునులేత
కలల పేరంటాళ్ళ కథల ముత్తైదువుల
పిలిపించి ఇలనెల్ల పిలిచింది ఆమె–

పిలువకుండా వచ్చు పేరక్క లెవ్వరో?
బిడియమా? సిగ్గులా? సహజమౌ మౌనమా?
ఏగోము కోసమో? ఏ నోము నోచునో
ఈ పూజ చివర కేమి ఉద్యాపనమొ

నిదుర నిప్పులమీద నివురు కప్పేవేళ
ఎదల పువ్వులపైన మంచు కురిసేటపుడు
పెదవి కదుపక ప్రేమమంత్రాలు వల్లించి
మదన పూజలచేయు అదనులో పదునుగా–

ఏది పళ్ళరము? ఏది ఓగిరము?
ఎడద నైవేద్యము చేయు వేగిరము!
ఏ వరము కోరుకొని చేతువీపూజ
ఏ వాయినము యిత్తువోగాని బేల?

పడుచుదనం రైలుబండి....

పడుచుదనం రైలుబండి పోతున్నది
వయసువాళ్ళకందులో చోటున్నది

కుర్రకారు పిల్లవాళ్ళు రాకూడదు
ముసలివాళ్ళు పిసినిగొట్లు రామాళదు
కష్టాల స్టేషనులో బండి ఆగదు
బండిలోన విచారాన్ని లుగళబారదు

ఇక్కట్టులు లేకుండుట టిక్కట్టండీ
చక్కగ నవ్వేవాళ్లే బండెక్కండి
ప్రియురాలి కంటిరెప్ప సిగ్నెలు రెక్క
జవరాలి పైట చెంగు జెండాముక్క

విరహాల నిట్టూర్పులు రాక్షసిబొగ్గు
ఇంజను త్రాగేనీరు తొలగని సిగ్గు
ప్రేమగీతులే మనకు దారిబత్తెము
ఏ స్టేషను చేరాలో మీ చిత్తము

ఎంచక్కని కల....

మీటనొక్కి చంద్రుణ్ణి వెలిగించు
మీటనొక్కి చిరుగాలి విసరించు
ప్రియురాలి పెదవిమీద పెదవి మూసి
సన్నని సంగీతంలాంటి నడుంచుట్టూ చెయ్యివేసి
ఆనందించు అబ్బాయీ! ఆనందించు
అందించు అమ్మాయీ! పెదవి అందించు
సద్దుచెయ్యకుండా పడుక్కొంది సముద్రం
ముద్దు పెట్టుకుంది చంద్రుణ్ణి మేఘం
మీ యిద్దరి కోసమే ఆగిపోయింది రాత్రి
మీ కోసమే వెలుగుతూంది అగరువత్తి
కావలించుకొండి కావలసినంత ఏకాంతం
కలకలా నవ్వండి మీ చుట్టూ ప్రశాంతం!

నిన్న సాధ్యంకాని తీరుబాటు
నిన్న అందనటువంటి ఆనందం
ఇవాళ ఒడ్డులొరసి పారుతూంది
చేతినిండా దొరుకుతూంది!

నిన్న మన తండ్రులు చాలా నిస్సహాయులు
వాళ్ళ తండ్రులు అంతకన్న అసహాయులు
వాళ్ళ చుట్టూతా మైళ్ళకొద్దీ బీళ్ళు
ఎప్పుడో యింకిపోయాయి వాళ్ళ కన్నీళ్ళు
నిన్న చెరువులూ చెట్లూ ఎండిపోయాయి
బావులూ బతుకులూ యింకిపోయాయి
పశువులూ శిశువులూ చచ్చిపోయాక
కడుపు దహిస్తే ఆడువాళ్ళు పడుచుకొన్నాక
కడుపున పుట్టినవాళ్ళని అమ్ముకొన్నాక
మన తాతలూ తండ్రులూ విలపించారు
తమ దరిద్రం కారణం గుర్తించారు

తెరచిన కన్నులు మూయకముదే
దీనులు పేదలు లేచేవారు
తీరుబాటుగా నిదురించే
తొలికోడిని తామే లేపేవారు

అరక కట్టుకు దున్నబోతే అంతా మెరక
అందులో మొలిచేదికాదు కనీసం గరిక
బక్కచిక్కిన ముసలి ఎద్దులకు, పాపం,
దుక్కి దున్నకముందే వచ్చేది ఆయాసం
ఒళ్ళు హూనం చేసుకొని పండించిన పంట
కళ్ళలో వత్తులేసుకొని కాపు కాచిన పంట
సగం వడ్డీకింద తతిమ్మాది శిస్తుకింద

రోజంతా పనిచేస్తే అరగంట విశ్రాంతి
తన బ్రతుకులాగే మాసికలు సైతం చిరిగి
అమావాశ్య ఆకాశంలా ఆరవేసేది చీర
గుడిసెలోంచి బయటకు వచ్చేదికాదు చెల్లి
పొయ్యిలోంచి లేచేదికాదు ముడుచుకున్న పిల్లి!
అప్పుడు అందరం కలసి ఆలోచించాం
ఎగుడు దిగుళ్ళు చదునుచేసే
యంత్రాన్ని తీసుకువచ్చాం
అప్పుడు అందరం కలిసి సంతోషించాం
బండలూ బాధలూ పగిలిపోయాయి
చింతలూ వంతలూ చితికిపోయాయి
తాళ్ళూ రాళ్ళూ నలిగిపోయాయి
కంచెలూ కరువులూ కరిగిపోయాయి
కలకలా నవ్వుతూ యంత్రాలు తోలుతూ
కనుచూపు మేరంత చదునుచేశాం
మళ్ళు కట్టి పొలం పదునుచేశాం
అరగంట పనిచేస్తే రోజంతా విశ్రాంతి
వానలు కురిశాయి పంటలు విరిశాయి
చెరువులు నిండాయి చేలు పండాయి
గనులు దొరికాయి పనులు దొరికాయి
ఫ్యాక్టరీలు వెలిశాయి పట్నాలు నవ్వేయి
ఇవాళ విశాఖపట్నం సందిట్లో గోదావరి పరిహాసం

ఇవాళ అనంతపురం పందిట్లో కృష్ణవేణి దరహాసం
శోభనం పెండ్లికూతురిలా పండింది ధాత్రి
పచ్చపైరు తలవంచి సిగ్గుపడుతూంది
పుష్కలంగా పంటలూ ఆశలూ పండే
పుష్యమాసమంతా మనకి పండుగే
కోతలు కోశాక కుప్పలు వేశాక
చేతినిండా మనకి తీరుబాటే
తాతానగరంలో చెంజీకటిలాగ
ఆంధ్రదేశ మంతటా ఎర్రనిరాత్రి
ఆరుబయట చలిమంటలు వేసుకొని
ఆడా మగా సాయలా సాయలా ఆడుతూ పాడుతూ
అప్పుడే గానుగాడిన చెరుకు పానకం తాగుతూ
మూడోఝాము దాటాక అలసిపోయాం

జామిచెట్టుమీద జాతి రామ చిలుక
చింతచెట్టుమీద చిన్ని గోర్వంక
జోడీలుగా వాళ్ళకి వలపులు
బేడీలుగా చెట్టాపట్టాలు!

అందించండి అబ్బాయిలూ! ఆనందించండి
ఆనందించండి అమ్మాయిలూ! పెదవులందించండి
ఒంటరిగా ఎవ్వరూ వుండకూడదు
జంట మాత్రం విడువనే కూడదు
పంట కాలువలో పడవషికార్లు చెయ్యండి

పరవశత్వంతో కన్నులు ముయ్యండి
పోయింది పాడు కలలాంటి నిన్నటి రూపు
పోబోదు తియ్యనికల మనకి నేడే రేపు!
చీకూ చింతాలేని ఏ దేశంలోనైనా
శాంతీ సౌఖ్యం వెలసే ఏ కాలంలోనైనా
కౌగిలిలో కనుమూసిన ప్రియురాలి పెదవి
కలకాలం కోరదగ్గర దేవేంద్ర పదవి!

www.vaaradhionline.com

పడును వానజల్లు...

పడును వానజల్లు
కదలకు నా ఇల్లు

ఉరుము ఉరుమునోయీ నను
ఒంటిగ విడనాడకు
చరణదాసినోయి – ఇటు
సాగిపోదు నేడకు?

పిడుగుపడిన గుండెలో
దడరేగును స్వామీ
హాడలిన నను చేరదీసి
ఊరడించవేమీ

కడుదూరం....

కడుదూరం అనురాగం
కడకు మిగిలె వియోగం

ఎండిన జీవన నదిలో
ఎటుల సాగు నౌక?
పంజరమే మిగిలెనా
ఏదీ నా చిలుక?

లేదు లేదు వేకువ
తెలవారదు రేయి
పగిలిన నా హృదయం
శకలములొక వేయి

ఆకాశవీధిలో....

ఆకాశవీధిలో ఎన్ని తారకలో
అణగారె మనసులో అన్ని కోరికలు
జాలిగొని పొగమంచు కన్నీటి ధార
జలజలా కార్చేను మింటి ధ్రువతార

ఆకాశవీధిలో ఎన్ని మేఘాలో
అణగారె మనసులో అన్ని భావాలు
తొలిసారి చూపే కడసారిదాయె
వేసారి వేసారి ఆశ కడతేరె

ఆకాశవీధిలో హరివిల్లు విరియ
ఎన్నివర్ణాలో అన్ని ప్రణయాలు
ఏడాదికొకసారి హరివిల్లు విరిసి
ఆనాడు కులికేను నా మనసు మురిసి

ఈ చల్లని రేయి....

ఈ చల్లని రేయి తిరిగిరానే రాదు
నీ చక్కని మోము చూడతనివి తీరదు

ఎవరికొరకు నా హృదయము ఎదురుచూచునో
తెలియరాదు వలపుగాలి ఏల వీచునో

అందమైన చందమామ చేతి కందదు
అందువరకు నా మనసు తృప్తిచెందదు

మినుకు మినుకు మనెను కనులవెర్రి తారలు
అదరిపడెను నా మనసు వేయిసారులు

ఎవరికొరకు ఈ హృదయము ఎదురుచూచునో
తెలిసెనులే వలపుగాలి ఏల వీచునో

మంచి మనసును....

మంచిమనసును మించగలిగిన ధనము ఏముంది!
మంచిప్రేమ జనించడంచే జగము బ్రతికుంది.

ఎవరినీ ప్రేమించకుండుట అదే ఒక నేరం
ప్రేమ తెలియని జీవితాలు భూమికే భారం

డబ్బుకీ తొలిప్రేమకీ కలదు కడుదూరం
డబ్బు గొడవలు లేనినాడే తీపి సంసారం

ఎదలో ఏదో....

నిరాశ పెనుచీకటిలో
విరాళి దీపాలారినచో

ఎదలో ఏదో దడదడ
కన్నీరే ధార కటకట

మనసే చెరువైపోతే
తనువే వొరుగైపోతే

ఎదలో ఏదో దడదడ
బ్రతుకే బరువు హరహర

నిముసము ఒక యుగమైతే
అమృతము గరళము కాదా

ఎదలో ఏదో దడదడ
రారా స్వామీ బిరబిర

ఈదలేనోయీ....

ఈదలేనోయీ స్వామీ తీరము
చేరలేనోయీ, నాతరము కాదోయి

తీరాన నిలబడి తీరుబాటుగ నీవు
తిలకించుతున్నావు స్వామీ నాపాటు
తిలకించుతున్నావు గానీ
ప్రాణాలు తీయవేమీ?

తీరాన ఏదో దివ్యమధువున్నదని
దింపావు నదిలోన స్వామీ నన్నిటుల
దింపావు నదిలోన కానీ
సాయాన్ని పంపవేమీ?

ఎవరు కన్నారు?

ఎవరు కన్నా రెవరు పెంచారు
నవనీతచోరుని గోపాలబాలుని

నోమునోచి నెలలుమోసి
నీలమేఘ శ్యాముకన్నది దేవకి
లాలపోసి, పాలుపట్టి
జోలపాడే కలిమికలిగె యశోదకి

తడవతడవకు కడుపుశోకము
తాళజాలక పెంచనిచ్చెను దేవకి
తాను కనకయె తల్లియయ్యెను
తనయుడాయెను దేముడే యశోదకి

ఎవరు కనినా ఎవరు పెంచినా
చివర కత డానంద మిచ్చిన దెవరికి?
అవనిలో తనపైన యెన్నో
ఆశలుంచినవారికి, తన నాశ్రయించినవారికి

పిల్లనగ్రోవిని....

మత్తుమందు జల్లి మైమరపింతువా?
పాటవినిన కలుగు పరవశమ్ము...
నీదు వేణువందు నింపిన మధువేమి
గుట్టు తెలుపవేల గోపబాల...

పిల్లనగ్రోవిని మెల్లగా నూదుచు
మై మరపింతువు కృష్ణా
నీ వేణువులో ఏముందో తెలియక
వేసితీ నీ ప్రశ్న...

నీలాటి రేవులో నెలతలు
నీ గానము వినగానే
తన్మయమొంది తనువులు మనువులు
మరచుట కనగానే
వలువలు మనసులు దొంగిలించినా
వారికి తెలియదు కృష్ణా
నీ తీయనిగానము ఎంత గ్రోలినా
తీరదులే తృష్ణ

మనుజుల కేమి ప్రకృతికైనా
తనువు తెలియదోయీ
పువ్వులు తీగెలు తరులు నదులు
పులకించుట కేమి
ఆకాశములో పయనము మాని
ఆగిపోవు జ్యోత్స్న
జోలవలె జోకొట్టే మురళికి
జోహారులు కృష్ణా

వాడే చోరుడే....

వాడే, చోరుడే, నందకిశోరుడే
మెలకువగా నుండవే కలికీ రాగలడే
చిన్ననాడు యశోదమ్మ కన్నుల ముందే
వెన్నముద్ద దొంగిలించ నేర్చినవాడే
అన్నిటికీ ఈనాటికి ఆరితేరినాడే

కోనేట నీట జలక మాడు గోపకాంతల
నేరుపుతో వేణువుతో నిద్రపుచ్చుతూ
కోకలన్ని కొల్లగొట్టు గోపబాలుడే

ధనమూ, యౌవనమూ అన్నీ విడనాడి
వనములందు చేరిననూ విడువనివాడే
మునిజనుల మనములనే ముచ్చిలు పరమాత్ముడే

ఎవరేమన్నా....

జాబిలీ, నీగాథ ఒక వింత గాథ
నీ వెలుగులోనే తొలగు మా బాధ

ఎవరేమన్నా ఏమనుకొన్నా చంద్రా ఆగకు
నీ మదిలో నమ్మినదానిని నీవు చేయుట మానకు

నిను చూడగనే కమలకాంతలు రుసరుసలాడినా
నినుగని కలువ కన్నెలసొగసు మిసమిసలాడినా
నీ వెన్నెలలో నవప్రేమికులెంతో సంతోషించినా
నీ వెలుగును చూసి కన్నపుదొంగలు కడుదూషించినా

ఎవరేమన్నా...

తారాసతి మది దొంగిలించితే మునులూ దేవతలూ
నేరాన్నేదో చేశావని నిను నిందించారోయి
హాలాహలమును మింగిన శివునికి చలువకూర్చగానే
చాలా యోగ్యుడవని వారే నిను సమ్మతించిరోచి

ఎవరేమన్నా....

జాలువా విరాళి....

ఎవరు వింటారు నీ వెర్రిపాట
అంటావు నీవు దయలేని నోట
వ్యర్థమై పోవనీ నా పిచ్చి కయిత
అర్థమైతే చాలు అది నీకు దయిత

అలంకారములు లేని నీ బోసి ఎడద
వలపు పైడి నగలను కోరుకొనద?
అందుకో అందుకో నా జాలువా విరాళి
అందుకొనవేని కలుగునే తగని బాళి

స్నేహ మింకిన జీవనదిలోన నేను
దేహ మిడ్చుకొనుచు నడువగా లేను
చాలులే నాకొక్క కన్నీటిబొట్టు
తేలి చేరుకొంటాను అవతలి గట్టు

అచట చీకటిమూక తపనీయ కాంతి
అచట అశ్రులుకూడ మధుర స్రవంతి
అచట నిట్టూర్పు చలిగాలి వీవన
అచట ఎడబాటుకూడ చక్కని దీవన

తోడు లేనట్టి బ్రతుకెవుడైన వమ్ము
నా ఎద మేడలో పెట్టుకో కాపురమ్ము
చూడు కట్టేను నీకొరకు చుక్కల భవంతి
అందు నీవలన అమవసనాడు చందురుని కాంతి

"వీధిలో పోతూంది ఎవరిదో ఒక యువక శవము
అది విని చూడవచ్చేవు ప్రేయసీ నయము
బ్రతికినన్నాళ్ళు కన్నెత్తి ననుు చూడలేదు
ఇపుడైన వేగపడినావు అది యెంత కాదు?"

అని పాడినాడొక పరదేశి కైసరి
అటులనే నేను పాడక తప్పదీ తరి
నిన్ను పిలుచును నా ప్రతియొక్క నిట్టూర్పు
నా వైపు వేయు నీ ప్రతి అడుగు ఓదార్పు

ఎడబాటు....

మన్ను మిన్నుల నేకమ్ము చేయు ఈ వర్షము
నన్ను నిన్ను నొకటిగా చేసి కూర్చుదే హర్షము
పడును ఎడతెగని కన్నీటి వానజల్లు
విడిచిపోయితి వేల ప్రియతమా ఎడద ఇల్లు

కొన్ని యుగముల నిరీక్షణమైన పిదప
చిన్ని నగవులు మెలగు నీ పెదవి మెదప
పడెను వీనులలోన వలపుమాటల వాన జల్లు
కడకు గుచ్చితి వేలకోగాని నా ఎదను ముల్లు

ప్రియుల ఎడబాటు మరకదుళ్ళయంత్రముగ తిరుగు
రేయి పొడుగున నే విడుచు నిట్టూర్పులే నూలుపోగులగు
దట్టమౌ నిట్టూరుపుల నేసి కుట్టినది మేఘాల అంగదట్టము
కట్టుకొని, కట్టుకొన్నది నిశాకాంత పాపాలపట్టము

అందె ననుకొంటి అందని అందాలమ్రాని పండు
అయిన నేమాయె నేమాయె నందు చేదులుమెండు
కలత పెట్టెడి నేటి కరకు కలయికలు నిప్పు పూలు
కనుల కపరిచిత రూపులమైన నాటి తహతహలె మేలు

దూర దూరాల నొండొరులకై నొగులు నపుడు
తొలి దినమ్ముల మన మనమ్ములు చేరువగనుండె
చేరువకు చేరి పరస్పర సాంగత్యమొందితి మిపుడు
నీరముల నింపె కన్నులు; దూరమై ఎదలు మండె

తరతరమ్ములనుండి లెక్కింపలేని భగ్న ప్రేమికుల బాధ
పరికించు సనాతన లోకమున కిది పాత గాథ
కాని మనకిది నవ్యానుభూతి అతి పురాతనమైన సరికొత్త వ్యథ
తేనెయో గరళమో తెలియని తీక్ష్ణ జ్వాలా మాలా కుసుమ సుధ

నన్ను విడనాడి దయమాలి పోయితివిగాని
సుఖపడుము నీవు
ఇన్ని కన్నీళ్ళు కొగిళ్ళు ముళ్ళు మరచి
చేరుకొను మావలిరేవు
నీవు లేనంత మాత్రాన గుండె పగిలి
ఒక్కసారిగ మరణించబోను
నిన్ను తలపోసుకొనుచు బ్రతికి
క్షణక్షణ మరణమ్ము పొందెదను నేను

శోకాల బాకాలు....

విరిగిపోయిన సోపానాలమీద
అరిగిపోయిన అడుగు జాడలు
పడిపోయిన భావాల గోడలమీద
పడతాయి భూతాల నీడలు
విడిపోయిన నవ ప్రేమికుల మధ్య
పుడతాయి తలపుకలుపు మొక్కలు

చుక్కాని లేని నీ వలపు పడవ
మునిగిపోతుంది ఈ తడవ

సూర్యోదయం యొక్క గరుడ ముక్కుమీద
ఆర్యోక్తులు నెమరువేసే వెర్రి గొంతుక
చంద్రకాంత శిలా వేదిక చేతిమీద
ఇంద్రజాలం మరచిపోయిన గుడ్డికన్ను
కాలు కాలిన గాలిదేముడి వీపుమీద
తేలు కుట్టినట్టు స్వారీచేసే పిచ్చిమనసు

తొణకని నీ ఎడద కడవ
పగిలిపోతుంది ఈ తడవ

పుస్తకాల కాటుక కొండల చాటున
అస్తమించిన అరుణారుణ ఆశాబింబాలు
ముళ్ళ సెలయేళ్ళ కుంటి వలపు గుర్రాల
కళ్ళ కళ్ళాలు లాగలేని సన్నని వేళ్ళు
శుక్తిలో స్వాతి చినుకులాగ సుప్తిలోపడ్డ
రక్తిరహిత విరక్తిభరిత రక్తపాశాలు

మన్మథుడు పోకిరీ భడవ
గోలచేస్తాడు ఈ తడవ

శోకాల బాకాల నూదుతూ సాగే
రాకాసి సైజు ఎర్రని విరాగాల బస్సు
ఆగే స్టేషనులో ఆగకుండా నీళ్ళు తాగకుండా
పోగాలపు పొగలు గ్రక్కే విరహాల ఇంజను
కారుమేఘాల పొలాల గుబురుల్లో
దారితప్పిన రెక్క విరిగిన ప్రేమ – డకోటా

దిగమింగుకోవాలి ఈ తడవ
వ్యక్తిగత విషయాల గొడవ

వచ్చేను వచ్చేను....

వచ్చేను వచ్చేను దీపావళీ
ముచ్చటగొలిపే పండుగ భళిరాభళీ

ప్రతిమనిషీ ఆరోజు రంగరంగేళీ
ప్రతిమనసున పయనించును కొర్కెలడోలీ

ఇంటిలిపాదీ కాల్తురు టపాకాయలు
మా బావగారు కోస్తారు సొరకాయలు
లేత సొరకాయలు
మరదలుపిల్లల మాటలు చలాకలుగా – అవి
రంగు రంగు కాంతులీను పటాకీలుగా

పసివాళ్ళకి కావాలి కప్పగంతులు
ముసలాళ్ళకి సరిపడేవి వెన్నముద్దలు
పూల వెన్నముద్దలు
అమ్మాయిగారు వెలిగింతురు కాకరపూవత్తులు
బామ్మగారు వెలిగింతురు వట్టి వత్తులు

ఆకాశం అందుకొనే అవ్వాయి చువ్వ

ఏమిటది జవరాలి చక్కటి నవ్వా?
కాదు కాదు మొట్టమొదట కలిగిన లవ్వే
ధ్రువతారను చేరి వెలుగు తారాజువ్వే

www.vaaradhionline.com

అడియాస....

నీ ఆశ అడియాస
చెయిజారె మణిపూస
బతుకంతా అమవాస
లంబాడోళ్ళ రాందాస.

గుండెలలో గునపాలు
గుచ్చారే నీవాళ్లు
కన్నులలో గోదారి
కాలువలే కట్టింది

తలచినదీ ఒకటైతే
జరిగినదీ వేరొకటి
చితికినది నీ మనసు
అతుకుటకు లేరెవరు.

నీలాల చుక్కలకై
నిచ్చెనలే వేశావు
ఆకాశం అందేనా?
ఆశయమే తీరేనా?

ఒక్కా ఓ చెలియా....

బేడీలుపడ్డ చెయ్యి ఏం రాస్తుంది?
పేదవాళ్ళకి సాహసం ఎలా వస్తుంది?
ససవలూ బానిసలూ సంఘటితం కాలేరు
అసలు అజ్ఞానులెన్నడూ తిరగబడలేదు

వినం వినం వినం వినంగాక వినం అనే
సీసం బిరడాలు తాపడం కాబడ్డ
చెవులముందెందుకీ విమల గాంధర్వం?
ధనం ధనం ధనం తప్ప వేరేదీ
ఘనం కాదు కాదు కానే కాదనే
గాజు కళ్ళముందెందుకీ రసమయ కళాఖండం?

తరుణోపాయం లేదు తమ్ముడూ జీవించి లాభం లేదు
మరణించడానికి కూడా మార్గం లేదు మరో దారి లేనే లేదు
అరుణోదయం అయ్యేదాకా ఆశలుంటాయో లేదో చెప్పు
కరుణలేని లోకంలో కడుపు నిండుతుందనుకోవడం తప్పు

అయోమయమైన వర్ణచిత్రంలాగ అల్లుకుపోయింది భవిష్యత్తు
క్రియాశూన్య పథకాల కిలుంపాత్రల నీరుచే కలిగే మత్తు

అఇ ఉణ్ ఐు ొక్
అందమే హుతభుక్
క ఖ గ ఘు ఞ
కష్టాలకు సంజ్ఞ

చ ఛ జ ఝు ఞ
చావుకి అనుజ్ఞ
అ ఇ ఉణ్ ఐు ొక్
ఆశే మనశుక్కు

అందమైన బ్ర–
కొంత మెతుకుతో
నిండుతుంది స్మీ

కడుపునింపు మె–
కొంత బ్రతుకులో
దొరుకుతుంది లే

రొండూ రోకళ్లూ....

వినుమా వినుమా వినుమా
వినుమా రూపాయిల డెక్కల ధాటి వినుమా
సిపాయిల క్రొన్నెత్తుటి ధారల
తుపాకుల కత్తులపై చారలు కనుమా

సరి సరి సరి
ఉరికంబాలకు మన ఆశయాలు బలి
రాబందుల రాజ్యం లోపల
ఆంబోతులే అమాత్యులు కదా మరి

పాలితుల మెదళ్ళకు దళ్ళు కట్టి
వాళ్ళ చూపుదారిలో కాపలావాళ్ళని పెట్టి
వాళ్ళ కళ్ళ కిటికీలు మూసి మేకులు కొట్టి
పరిపాలించబోతుంది రేపటి రాజ్యం
మొరలాలించడం అందులో పూజ్యం
ఆశయాలకోసం అనువులు బలిచేస్తున్నా మిప్పుడు
అనువులకోసం ఆశయాలు బలిచేస్తామప్పుడు!
అప్పుడు ప్రతి ఒకడు ఇంకొకడికి కార్బను కాపీ

అప్పుడు ప్రతి యింట్లో శవం లేచినట్లు మరిగే నిశ్శబ్దం
వైతరణికి కాలువలు, కట్టలు కట్టి
రైతులను పండించమంటారు వ్యర్థ
పద దానివల్ల తీరుతుందా క్షుధ
పద పద పద

మూడూ ముచ్చెలుకా....

ఉండిపో
ఊరుకో
ఎదిరించక ఏం లాభం
ఒక్కడివే
ఎక్కడికి?
ఎక్కడైనా ఒక్కటే

"నన్ను చూడు
మిన్ను చూడు
మీదని పయోధరాలు"

వానొస్తే
వరదొస్తే
వెళ్ళకు చీకట్లో పడుక్కో వాకిట్లో

ఊపిరి పీలుస్తున్న చూచుకం
ఊరిస్తున్నది చర్మంలో కోర్కెలు
జీరాడుతున్నవి ఉలిపొర కుచ్చిళ్ళు
పోరాడుతున్నవి వాటితో ఉవ్విళ్ళు

పయనించడానికి బదులు మైమరచి
శయనించెను మేధావి మెదడు
పువ్వుని తెలిసినవాడు అతగాడు
రేకు లొక్కక్కటీ తెంపివేస్తున్నాడు

దైనందిన జీవన సమరంలో
దైన్యంగా ఓడిన మానవుడు
ధనానికీ నిధువనానికి
దాసుడైన దానవుడు

మేలుకో
కోలుకో
మేలైన పనికి పూనుకో

నాలుగు నందన్నా...

నందుడు రాజవుతాడు – ఆనందం కలుగుతుంది
మందుడా మరణించుతావు అందరి వ్యధి తొలగుతుంది

నందోరాజా భవిష్యతి
ఎందుకో ఒకందుకు ఆ
నందోరాజా భవిష్యతి

కొనసాగే ఉద్యమానికి వెరచి
మూసిన కిటికీ తెరచి
చూడంగ లేదు నీ కన్ను
భయపడి వణికేను వెన్ను

తల్లి పెదవిపై చిరునవ్వు తొల్లి ముచ్చలించావు నువ్వు
తెంపివేశావు జాలిమాలి తోడబుట్టు పడుచు తాళి
కలిపావు నోటిముందు కూట్లో దుమ్ము
కోశావు పాలుతాగిన తల్లిరొమ్ము

ఒలిచావు కాశీలో గోమాతచర్మం
చెప్పులు కుట్టించి చేశావులే ధర్మం

ఎరుపురంగంటే నీకు వెగటు ఎందుకో తగని వెరపు
ఐదువరాలి కుంకుమరేఖ
అందుకా చెరిపావు దయలేక

నందోరాజా భవిష్యతి
నందోరాజా భవిష్యతి
నందోరాజా భవిష్యతి

మందుడా మరణించుతావు నీ పీడ విరగడవుతుంది
కందుకంలాగ ఎగురుతాం కల్పవృక్షం అందుతుంది

అయిదూ చిటిగొలుసూ....

చాంగు భళారే చాంగు భళా
జంకేల గొంకేల చాంగు భళా
చెరసాల ద్వారాలు తెరిచారు పారాలు
ధరలోన యికమీద చాంగు భళా
చెరసాల లుండవు చాంగు భళా!

హుంకరించెను విప్లవాంకురము మృత్యువై
కంకాళములు సమర ఘీంకారములు జేసె

ధంకా బజాయించి చాంగు భళా
సంకెళ్ళు విరిగేయి చాంగు భళా!

భూతాలు వైప్లవ్య గీతాలు పాడేయి
ప్రేతాలు 'లావా'కు ఏతాము తోడేయి

చేతనముతో వేగ చాంగు భళా
ఛాతీలు విరుచుకొని చాంగు భళా!
మలయ పవనముకాదు మరణ ఝంఝులు రేగె
విలయ రుద్రుని వీరభద్రుని సేన

విజయసాధనకై చాంగు భళా
విశ్రమించుట లేదు చాంగు భళా!
పిరికి గుండెలు పేల్చు, కరుకు గుండెలు కాల్చు
నరకాన్ని నరకాలి చాంగు భళా!
దొరకాలి స్వర్గమే చాంగు భళా!

చాంగు భళారే! చాంగు భళా!
జంకేల గొంకేల చాంగు భళా!

ఈ పొలము నీదే యీ హలము నీదే
ఈ ఇల్లు నీదే యీ మిల్లు మనదే
గనులన్ని మనవే కదరా భళా!
పనిముట్లు మనవే పదరా భళా!

ఆరుం దారాలు....

ఇరుకు మురికి రోడ్లమీద
క్రిక్కిరిసిన ఇళ్ళమధ్య
ఈ కాలము స్తంభించెను
ఇరులు భువిని చుంబించెను

ఈ చీకటి కొండలపై
ఇనబింబం ఉదయించదు
ఈ బజారు ముండలలో
ఇన్నరంభ కనిపించదు

పడుతున్నది కన్నీటి జడివాన
కొడుతున్నది నిట్టూర్పు చలిగాడ్పు
కన్ను పొడుచుకున్నా ఇది ఏమాత్రము
తెన్ను తెలియని పాశవిక కాళరాత్రము

ఇపుడు ఏ గుండెల వాకిలిలో తల దాచుకొనుట?
ఏ కౌగిలిలోగిలిలో నా ప్రేమను దాచుకొనుట?

వణుకుతున్న నా ఈపేలిన పెదిమలకై
కణకణలాడును ఏ రొమ్ముల కుంపటి?

కొరడుబారి మరణించే కోర్కెలమేనికి?
వరప్రసాద మే కురుల కమ్ముల దుప్పటి?

ఏ ఎర్రంచుల తెల్లనవ్వు ఈ చలిలో కప్పుకొనుట?
ఏ కొనచూపుల కొవ్వొత్తుల కీ చీకటి తప్పుకొనుట?

ఆప్తుడెవ్వడు? నీ మిత్రుడెవ్వడు?
చెలి
తప్తహృదిలో దీర్ఘ
సుప్తవాంఛకు పరి
తృప్తి ఎన్నడు? సంతృప్తి ఎన్నడు?

కమనుడెవ్వడు? నీ రమణుడెవ్వడు?
సఖి
యముడు వెంటాడగా
సమసిపోయెను కోర్కె
శమనమెన్నడు? సుఖ శయనమెన్నడు?

తోడులేని నాచుట్టూ చీకటావరించు
దూరదూరతీరాల్లో చుక్కలావులించు
శవంమీద ముసుగులాగ భూమ్మీద మంచు చలిబారిన
గుండెలలో ఆవేదన మించు

ఏడుం బేడీలు....

ఏ కొమ్మ మీదనో ఎలుగెత్తె పులుగు
ఏ కొమ్మకోసమో ఈ కనులు కనలు
ఆకొన్న కంటిలో ఆతురత రగులు
రాకున్న ఈ గుండె వేయిగా పగులు

ఆకొన్న ఈ గుండె వేయిగా పగులు
రాకున్న నీ కొరకు నాగొంతు నొగులు
నీ కేలు నీ కీలుజడ – కుచ్చు తలచి
శోకాన పడిపోయె నా బ్రదుకు వగచి

ద్రవీభూత విరహమ్మున తడిసెను నా 'మున్ను'లు
ఎవరికొరకు ఎవరికొరకు వెదుకు వెర్రికన్నులు
గగనమందు చిగురించిన నెరవెన్నెల వేసవి
నగవుల నీ పెదవులకై తెగవాచెను వాచవి

పగిలిన నా హృదయఫలక శకలము లొకవేయి
ఎగిరిపడిన విచటకొన్ని అచట పడినవెన్ని
దవుదవ్వుల వినన‌య్యెను మంటల జేగంట
దవానలము చివాలుమని రేగెను నాకంట

ఏమున్నది ఏమున్నది ఇకమీదట బ్రదుకు
ఎండమావి గున్నమావినెందుకాశ వెదుకు
ఏమన్నది ఏమన్నది కదలని నీ మోవి
ఏమన్నది ఏమన్నది మోవిమీది కాని

ఇంతలో మెరసింది ఇరులలో మెరపు
సంతోషకళికలను వెలిగించె వలపు
చింతించు హృదయాన చిగురించె వెలుగు
కాంత నీ రాకచే కర్కశత తొలగు

ఓ కలికి ఎడతెగని నీ కనుల పొందు
ఆకొన్న నా కనుల కమృతంపువిందు
నీకేలు నీ కీలుజడ – కుచ్చుతోను
లోకాని కెదురీత ఈదేను నేను

ఎనిమిది మనమందా....

నీ చేయి నా చేయిపై వేసి
నీ చూపు నా చూపు సై చేసి
నినుబాసి మనలేననే బాసను
నీ పెదవి నా పెదవిపై చేసెను

'ఉన్నాది ఆశపై కొన ఊపిరి
కన్నీరు కాదిదే గోదావరి
నన్నేల విడనాడి పోతావ'ని
అన్నావు బరువుగా ప్రాణేశ్వరీ

విడనాడక తీరలేదు
ఎడబాటే తప్పలేదు
ఇపుడంతా చేదుచేదు
ఈ దుఃఖము పోదుపోదు
నేను
ఆకాశమార్గాన పోతుండగా
నీవు
ఏకాకివై భూమిపై నుండగా

నాకు

నగరాన శతకోటి దీపావళి

కాక

అగుపించె నీకంటి చింతాఝరి

నీలమేఘాలు తాకి నా రెక్కలు
ఏల కారాదు రెండు ముక్కలు
నేలపై పడిపోయి నీ అక్కున
జాలిగా చేరెదను గ్రక్కున

నా మేను నీమ్రోల పడవేసి
నా బ్రతుకు నీ బ్రతుకు ముడివేసి
నినువీడి మనలేననే మాటను
నా ఎడద నీ ఎడదలో నాటును

తొమ్మిది తోకుచ్చు....

వస్తున్నా వస్తున్నా
వస్తున్నా వస్తున్నా
కాస్తా ఆగు!
ఇది నిటారుమిట్ట
నను పైకిలాగు!

ఎత్తు తెలియని నిటారు
నిట్టనిలువు అనంతం
"ఎన్నడులు?" ఎద దున్నుకొంటూ
భయం విస్మయం మేస్తూంది
మెస్మరించింది యౌవనం నన్ను
విస్మరించాను లోకమా! నిన్ను

నరకం ఇపుడుంటున్నది ఇది నాకొద్దు
స్వర్గం చూపిస్తావా? ఎందుకు పోనిద్దు
త్రిశంకు స్వర్గమిస్తావా? అది కూడా వద్దు
పలురకముల సౌఖ్యమ్ములు పాతకాల పద్దు
నలుచదరపు భోజనమ్ము నాకు ఇయ్యవద్దు

చెలిపోడిమి నిరర్థకం రేపటికది రద్దు
మూఢ తమోగాఢతలో సఖిగాజుల సద్దు
గాఢ పరిష్వంగంలో వేడివేడి ముద్దు
గబ్బుకొట్టు నరకానికి ఇవతలి సరిహద్దు

ఊబిలోన ఈదడమా
ఊహలలో బ్రతకడమా
గర్జించుము గర్జించుము గమ్యం సామీప్యం
విసర్జించు విసర్జించు విసర్జించు జాప్యం
రాదు రాదు రాదు ఎడదకు వృద్ధాప్యం
తెరువంబడె తెరచుకొనని దివ్యలోకదేహళి
విననయ్యెను బధిరులకే వీరోచితకాహళి
వస్తున్నా వస్తున్నా
కాస్తా ఆగు
చేయూతనిచ్చి మిత్రమా!
మున్ముందుకు సాగు

పదీ పట్టేదా....

"ఎన్నాళ్ళు?" వెంటతరమగా
"ఇంకానా?" ఒళ్ళుతురమగా
"ఎక్కడలు" వర్షించి
"ఎప్పుడులు" దట్టించి
"ఎందుకులు" రెట్టించి
పొగలాగ పొరలాగ
పోలేవు నీవు
అంత ఎత్తు ఎగురలేవు విదిలించకు రెక్కలు
ఒక్కడవే ఎక్కలేవు ఎందుకోయి చిక్కులు

ఒక్కడనే ఎక్కలేను
ఇంత ఎత్తు ఎగరలేను
ఎవరేనా తోడురండి
జీవితాన్ని పంచుకోండి
నాచుట్టూ ముళ్ళపొదలు
నాచుట్టూ మంచుపొరలు
కొరడుబారె గడియారం
కరడుకట్టి ఎదభారం

సాగలేను సాగలేను
కొండకొమ్మ ఎక్కలేను
ఎవరేనా తోడురండి
జీవితాన్ని పంచుకోండి
ఎత్తుని చిత్తుచేద్దాం
మత్తుని మాయంచేద్దాం
చేయి చేయి కలుపుకొనుచు
శిఖరాలను ఎక్కుదాం

ఇక్కడే
ఇప్పుడే
ఇందుకే
బ్రతుకుదాం

www.aaradhanaonline.com

చూశావా....

చూశావా మానవుని లీలలు – దేవ!
చూశావా మానవుని లీలలు

నిలుచున్న పాళాన నిన్నూ నీలోకాన్ని
తారుమారు చేసేటి మాయదారి లీలలు
భజనకూటమందుచేర భక్తి వచ్చునో లేదో
బయటుంచిన జోళ్ళజతకు కాళ్ళొచ్చుట ఖాయమయ్య

దేముడైన దయ్యమైన ధనము చేసుకొందికే
తావీజులు కడతాడు డబ్బులూడకొడతాడు
తెల్లార్లూ హోమాలని ఇల్లు గుల్లచేస్తాడు
దయ్యమొదిలిపోయినా తాను వదలిపోడయ్య

నీళ్ళలోన వున్నావు రాళ్ళలోన వున్నావు
నిఖిలజగతిలోన నీవులేనిచోటు లేదుగాని
డబ్బులిచ్చుకొంటేనే దర్శనమిప్పిస్తానని
గర్భగుడిలోన నిన్ను నిర్బంధించేశాడు.

ఇంత సిగ్గేలనే....

పెదవి కదపని నాడు
ప్రేమ తెలిపితి వెటుల?
పెదవి కలిపిన నేడు
పేర్మి కలిగిన దిటుల

ఇంత ప్రేమేలనే – నాకు ర
వంత చాలునులే.

పదిమందిలో నీవు
పడవు గానీ సిగ్గు
ఒండొరులమే యుండ
మెండుగా సిగ్గేలనే

ఇంత వలపేలనే – నాకు ఇసు
మంత చాలునులే.

వెలుగులో కలిగెనా
విలువైన ఈ సిగ్గు
ఇరులలో తొలగునా
ఇంతోటి ఈ బిగుతు

ఇన్ని మరులేలనే – నీకు
ఎన్ని ముద్దులు వలయునే?

నెచ్చెలీ నిన్నటి రేయి – మన
మిచటనే మత్తుగా చిత్తుగా
ముచ్చటలు గొలుపు – పచ్చ
పచ్చని కలలు కన్నాము
పచ్చవిల్తుని పూజ చేశాము

మలి జన్మలో మనము – చెలియా
పూలుగా పుడదాములే – ఈ వూరి అం
దాలుగా పుడదాములే.

ప్రేమికుల శయ్యపై పరిమళాలీనుచూ
కామనలు రేకెత్తు రేకులను తలనెత్తి
ఝాముసేపైనా పరులకానందమిచ్చే
పూలుగా పుడదాములే.
ఈ వూరి అందాలుగా పుడదాములే.

అపరాధమేదేని....

అపరాధమేదేని చేశాన అయ్యలూ
విపరీతమే కద మనకీ విడివిడి శయ్యలూ
అపురూపమైన మన అనురాగమిటులైన
అయ్యయ్యో నా ఎడత అగును కద వ్రయ్యలు ॥అ॥

తొలిరేయి మధురిమలు చిలికేవు ప్రతిరేయి
తులలేని కోరికలు త్రుంచావు ఈ రేయి
కలహించి తొలగితే కాక రేగేనురా
కలనైన కావించు కందర్ప చర్యలూ ॥అ॥

నిను కాదని నేను నిమిసమోర్వగలేను
నన్ను కాదని నీవు కన్నుచాటవ లేవు
నిన్న నీ మగసిరి చిన్నబోయినదని
ఉన్నమాటనగానే ఉలుకా రాయలూ ॥అ॥

(ముఖారి రాగంలో పదం. చిట్టిబాబుకోసం రాసినది)

నిందాస్తుతి....

వాడెంత మోహనుడే నల్ల
వాడెంత కడు వింత ఘనుడే

అలకలు కుదురుగా దువ్వెడి వాడే
వెలలేని తల నెమలి పింఛమువాడే
పసి వయసులో ఎన్ని పనులు గావించాడే
పరువాలు మెచ్చే నరవిటగాడే
కుసుమ కోమలులెందరో కోరినవాడే
అసురులే గొన్న అపురూపుడే

పదసేవ మరువని పరమాత్ముడే
ఎదలోన ఎదవోలె మెదిలేవాడే
పదునాల్గు భువనాల పరమాత్ముడే
హృదయాన కొలిచిన స్వాధీనుడే

(కార్వేటినగరంలో నృత్య నివేదనకోసం శ్రీ వి.ఎ.కె. రంగారావుకోసం ప్రత్యేకం రాసిన ఈ పాట రుక్మిణి-సత్యల నిందాస్తుతి)

పొంగింది యమున....

పొంగింది హృదయమున యమున
నింగి తాకింది ప్రణయమున యమున
రావయ్యా నల్లనయ్య నయమున – నీ
రాధికను ఏలుకో రయమున ॥పొ॥

ఇందూదయ సమయమున – మందానిల వలయమున
ఇందీవర నిలయముని – ఇందువిల్తుని విజయమున
రాధిక నీ సాయమున
రసించు తరుణ ప్రాయమున ॥పొ॥

విరహానల విలయమున – విహ్వలయైన రయమున
వెలువడె నీ రాధిక కెదురుపాట అభయమున
చందురు కూనలకీయమున
పొందులు ప్రేమికులా యమున ॥పొ॥

విరబూసి నవ్వింది....

విరబూసి నవ్వింది ఆమని – దాని
దరహాసం పరిహాసం ఏమని?
హత్తుకొని ప్రేమికుల్ని వుండమని ఉండాలని
ఆలుమగల అన్యోన్యమె పండుగని ॥వి॥

వేసింది ప్రతికొమ్మ కొత్త చిగుళ్లు – తరిమి
వేసింది కోయిలమ్మ గుండె దిగుళ్లు
పెద్దమేళం మ్రోగి ముద్దులు ఊరేగి
పిల్లపాప హృదులైనవి దేవుని గుళ్లు ॥వి॥

పెట్టుకొన్నాం వత్సరాల కరవై పేర్లు – ఆ
పేర్లకేమి పబ్బాల కవే తీర్లు
వేడుకలే నిండాలి కోరికలే పండాలి
ఏడాదికి మూడువందల అరవైమార్లు ॥వి॥

ఏమాసం ఇది? ఇవాళేం తిథి! – మనం
ఇలా ఇలా ప్రశ్నలు వేయవలదు వారి
చిత్తం రాజిల్లితే చైత్రమాసమే – జనం
మొత్తం రాణించితే వసంతహాసమే ॥వి॥

అదే ఆమని....

అదే ఆమని....

ఆనందం కలిగినపుడు అదే ఆమని
అయినవాళ్లు నవ్వినపుడు అదే ఆమని
అతని చేయి సోకినపుడు
ఆమె ఎడద సోలినపుడు
ఆత్మీయులు మురిసినప్పుడు

వేయిడోల లొక్కసారి ఊగినట్లుగా
తీయనైన లోకాలను చూసినట్లుగా
దోరవయసు తోటవోలె విరివిగా
తోచినపుడు ఎపుడైనా అదే ఆమని

పదను తేరి పడుచుదనం పొడినట్లుగా
హృదయంలో సన్నాయిలు ఊదినట్లుగా
తనలోపల శశికాంతులు తరగనట్లుగా
తలచినపుడు ఎపుడైనా అదే ఆమని

కోరికలే కోయిలలై కూసినట్లుగా
కొత్త కొత్త మురిపాలే కురిసినట్లుగా
పరవశాల జన్మంతా పండినట్లుగా
భావిస్తే ఎపుడైనా అదే ఆమని

ఆనందం కలిగినపుడు అదే ఆమని
అయినవాళ్లు నవ్వినపుడు అదే ఆమని.

www.vaaradhionline.com

ప్రణయ దృష్టి....

గొంతులోన కోయిలమ్మ గూడు కట్టెనా – నీ
వింత హొయలు పావురాల విడిది ఆయెనా?
కన్నులలో కలువపూలు కాపురముండే – నీ
వన్నెలలో వెన్నెలలే వాసము చేసి

శ్రీకారము నీ చెవిగా ఆకారము దాల్చె
చెంగలువలు మనసుపడి చేతులుగా మారె
నిగనిగల తారకలు నీ చూపులుకాగా
నిండు చంద్రుడే నిరతం నీ మోమై నిలచె

గులాబీలు చెంపలందు కులుకుచున్నవి
గుంపులైన తుమ్మెదలే కురులు అయినవి
పెదవులందు తేనియలే ఒదిగివున్నవి – నీ
హృదయసీమ దేవతల ఉనికి అయినది.

నీ చిరునామా ఏమి?....

ప్రభూ
నీ చిరునామా ఏమీ
నిజము చెప్పుమా స్వామీ
ఎవరెవరో ఏదేదో వివరించినను
విశదము కాని.... నీ... చిరునామా ఏమీ?

జ్ఞానులు తెలిపిరి నీ విలాసం
వారిని నమ్మిన జరిగెను మోసం
వ్రాసిన జాబులు వాపసు తెచ్చెను
ఈ సంగతి నీకేమిటి తెలియును... నీ...చిరునామా ఏమీ?

రాగాల యుగముల తేదీ వేసీ
గాదిలి నరులకు ఇస్తివె చెక్కు
మారని కరుణ మరల పంపగా
ఎడ్రసు తెలియదు ఏమిటి చిక్కు.. నీ చిరునామా ఏమీ.

ఆకాశం ఎంత ఎత్తు....

ఆకాశం ఎంత ఎత్తు
పాతాళం అంత లోతు
ఎంత ఎత్తు ఎంత లోతు అనాది ప్రేమతత్వం ॥ఆ॥

రమ్మంటే రాదు పొమ్మంటే పోదు
రమ్యమైన వలపు తీపిలోన చేదు
ఏటిలోని కెరటాలు ఎదలోని భావాలు
ఆగమంటే ఆగవు. వీగి విడిచిపోవు ॥ఆ॥

మంచుకన్న చల్లన మల్లె కన్న తెల్లన
మంచి ప్రేమలోకంలో నిత్యపచ్చన
మరులలోని నున్నదనం మాటలలో తియ్యదనం
కొరడు బారు చలిలోను హెచ్చయ్యే వెచ్చదనం ॥ఆ॥

ఆషాఢ మేఘం....

ఆషాఢ మేఘం ఒకటి అలా తొంగిచూసిందీ
పాషాణ హృదిలో సైతం పాట పొంగులెత్తిందీ ॥ఆ॥

శ్రావణ జలదం ఒకటి ఠీవిగా నిలిచింది
కావురు మబ్బుల బూదరవానకు
జీవనరాగం మ్రోగింది ॥ఆ॥

సిగ్గుపడే కరిమబ్బొకటి
శివార్లలోనే ఆగింది
జల్లు కురిసి పొమ్మంటే
ఒళ్లు విరుచుకుంటుంది ॥ఆ॥

గయ్యాళి దెయ్యపు మబ్బు కసిరినట్టు ఉరిమింది.
నాచుగాలి వీచగానే నంగనాచి తగ్గింది ॥ఆ॥

మురదండ మేఘం ఒకటి రవిబింబం కప్పింది
ముంతపోతగా కురిసే సంతోషం యిచ్చిందీ ॥ఆ॥
ముసాబులో చిటపట చినుకు హుషారుగా ఉంటుంది
తెలుగు భగ్గుల వెలుగుపోత దీవిస్తూ వుంటుంది. ॥ఆ॥

ఫక్కున నవ్వు....

ఫక్కున నువ్వు నవ్విన చాలు
చక్కదనాలు ఒలికేనే
పక్కన నీవు ఉంటే చాలు
ప్రపంచమంతా మెరిసేనోయ్ ॥ఫ॥

కోటిమందిలో ఉన్నా నిన్నే కన్నులు సూటిగా చూస్తాయి

కోరినవాని చేరగాపొమ్మని గుండెలు తొందరచేస్తాయి

నిగనిగలాడే నిన్ను చూడగా నిలిచిపోయింది కాలం

నీతో గడిపే కొన్నిక్షణాలే నిజమగు అమృతసారం
ఆకాశంలో ఆవలిగట్టున ఆశలు మేడలు కట్టినవి
కలిసి మెలిసీ మనసులు మురిసి కాపురమచటే పెట్టినవి ॥ఫ॥

గోపాలదేవుడా....

గోపాలదేవుడు – మధురలో నున్నాడా
మాపాలి దైవమిక మరలిరాడా
మా నల్లనయ్య మరి కానరాడక్కడ
మేనిలో జీవము నిముషమ్ము నిలుచునా ॥గో॥

మానివాసములో శ్రీనివాసుడు లేడు
మాధవుని చరణ విస్మరణమే మరణమ్ము
కన్నీరుమున్నీరుగా వెల్లివిరిసినది
కటకటా విరహాన కనలేను లతికన్ ॥గో॥

జొనా?....

నిండినప్పుడు నీ తలపులు
గుండె గుబాళిస్తుంది

నిన్ను కలగంటున్నప్పుడు
నిదుర పరిమళిస్తుంది.

అలనాటి విషయాలు అలలైతే
మలయ మారుతాలు వీస్తాయి మనస్సులో
ఈనాటి ఎడబాటు బరువై అదిమితే
ఎదలోన మొగలిరేకులు గుచ్చుకుంటాయి

రేపటి కలయికకై చూపులు త్వరపడితే
రేకు సంపెంగలు టోకున నవ్వుతాయి

నీ కురులలో మిళితమైన కురువేరు
నా కోరికల నరాలకి కొత్త మత్తు యిస్తే

సువాసన సీమల్లో
నివాసం చేస్తుంది వలపు

అనుబంధాన్ని మించిన
సుగంధం లేదు. సుకృతం లేదు

ఆ..ఆ..ఆరుద్ర.గీ.గీ.గీతం....

వెలగమంటే వెలుగుతాను
వెన్నెలలా కరుగు

వెళ్లమంటే పోతాను
వీధిలాగ పరుచుకో.

నన్ను నీ రక్తం పిలిచినప్పుడు
కన్ను పరధ్యానంగా వుంది
మొన్న నీ మౌనం పగలనప్పుడు
పొద్దు పొగచూరింది

దాచిన అశ్రులన్నీ పూచనప్పుడు
సంధ్యారాగం మబ్బుకున్నప్పుడు
గుండె గుబాళించనప్పుడు
నరాలు గుర్రాలు దిగనప్పుడు

నిన్ననో మొన్ననో పూర్వజన్మలో
నిద్ర చైతన్యాన్ని వలచింది
నీ నిట్టూర్పు నన్ను కలచింది

నిచ్చెనలు విరిచి పారేశాక
పచ్చిక వెచ్చగా నవ్వింది
నీమీద నేను పాడలేనుగాని
నా మనస్సుగా ఇలాగా స్పందించు.

www.vaaradhionline.com

ఎడబాటు కాటు 1....

తెలుగు మాట్లాడే దీపాలు
తెల్లవార్లూ వెలుగుతూ వుంటాయి
మేఘాల్లో టీ తాగుతూ
మేనమామగారింటికి వెడుతున్నాను
తల్లి పుట్టింటి సంగతి
తాపీగా చెప్పాలికదా వాళ్లకి?

ఒంటరిగా ఓపిగ్గా బతకడం
ఓ పట్టాన నేర్చుకోలేను
ఎయిర్ కండిషన్డు గదిలాంటి ప్రియురాలి
హృదయంలో బ్రతికేవాణ్ణి
ఎలాగ ఎడబాటు ఎండలో చచ్చేది

ఎడబాటు కాటు 2....

చక్షులు కరములు కర్ణములు
జమిలిగ ఇచ్చిన దేవతలు
ఒక నాలుక మాత్రమే ఇచ్చారు
ప్రకటించుట ఎట్లు నా వెతలు?

అధరామృత పానము లేనపుడు
మధుపానము కూడా మానెదరు
అధరాలకు భువిలో సాటేదీ
మధువందున పెదవులకైపేదీ?

ప్రియురాలిని దూరము పంపితిని
వెనువెంటనే రాదని మరచితిని
నా కరుణే నేటికి పగబూని
నా బానిస నాపై యజమాని

ఎన్నో ..... చదివినవాణ్ణి కదా
ఎడబాటుకు వగచుట వింతకదా!
అన్నీ తానే అవును కదా చెలి
నన్నెడ బాసిన చిత్రవధా!

చినబోయిన ఇంటికి పోలేను
నిను చూడక నిద్దురపోలేను
కనులారా ఒక పరి చూడనిచో
చనిపోవుటకైనా పోలేను

www.yaaradhionline.com

రామ..లక్ష్మీ....

భోజరాజు ముఖం చూస్తే
కవిత్వం వస్తుందట
నాకు – నీ ముఖం చూడకపోతే
ఎందుకొస్తుంది
చిత్రమైన చెలువా?
చిక్కు విప్పగలవా?
కవిత్వం మారుపేరు
కసరుగా వుండే సత్యం
బాధలో కూడా
నిజం చెప్పలేనివాడు
జీవించడానికి అనర్హుడు
ప్రేమకు నిజమైన ఫలితం
హృదయం బరువెక్కడం
ఆ...రుద్ర

ఎవరేమన్నా ఏమనుకున్నా చంద్రా ఆగకు....

సాకీ : జాబిలీ నీగాథ ఒక వింతగాథ
నీ వెలుగులోనే తొలగు మా బాధ

ప॥ ఎవరేమన్నా ఏమనుకున్నా చంద్రా ఆగకు – నీ
మదిలో నమ్మిన దానిని నీవు చేయుట మానకు

1. చ॥ నిను చూడగనే కమలకాంతలు రుసరుసలాడినా
నిను గని కలువ కన్నెల మనసు మిసమిసలాడినా
వెన్నెలలో నవప్రేమికులెంతో సంతోషించినా
వెలుగును చూసి కన్నపుదొంగలు కడుదూషించినా ॥

2. చ॥ తారాసతి మది దొంగిలించితే మునులూ దేవతలూ
నేరాన్నేదో చేశావని నిను నిందించారోయీ
హాలాహలమును మ్రింగిన శివునకు చలువ కూర్చేగానే
చాలా యోగ్యుడవని నినువారే సన్నుతించిరోయీ ॥

వేదంలా గోదావరి....

వేదంలా గోదావరి ప్రవహిస్తోందే చెల్లీ
వెన్నెలవలె కృష్ణవేణి విహరిస్తోందే తల్లీ

విశాలాంధ్ర నలుమూలల
వైవాహిక వైభోగం
జనుల కనుల వెలుగులలో
జాజులు వారెడి రాగం

గెలవేసిన అరటిచెట్లు తీసుకురానా తల్లీ
ఎలమామిడి తోరణాలు కట్టనా చెల్లీ

గడపమీద చిగురుజల్ల
గరిపొడిచెను శోభ
ముంగిటముత్యాల నవ్య
రంగవల్లి సుప్రభ

ఏరువాక పడవలాగ ఎద ఊగిసలాడునే
జోడెద్దుల బండివలె గుండెలురికి సాగునే

కల్యాణ తిలక రేఖగ
కస్తూరిబొట్టు దిద్దవే

తెలుగు వెలది బుగ్గమీద
దిష్టిచుక్క పెట్టవే
తలంబ్రాల తనిసినటుల ధరణి తోచునే చెల్లీ
వసంతాల తడిసినటుల సంజమెరయునే తల్లీ
జనావళికి సంతతం
సంతోషప్రాప్తి
విశాలాంధ్ర నిండా
వైవాహిక దీప్తి
తుత్తారా మాదిరిగా తుంగభద్ర నాదమే
సన్నాయికి మల్లే పెన్నానది గానమే.

ఆడిందే ఆట....

ఆడిందే ఆట; మా తెనుగు తల్లి
పాడిందే పాట

తెలుగుకోట బురుజుమీద
తెలుగుబావుటా, దానికి
ఇకమీదట ఎదురులేదట
మూడుకోట్ల జనుల మాట
ఒకేమాటట ఆమాటకి
ఇకమీదట తిరుగులేదట
తెలుగునేల విరగపండి
ఒకేపంటట, జనులకు
ఇకమీదట లోటురాదట
తెలుగుతల్లి ఇన్నాళ్ళకి
నవ్వినాదట, ఆచిరునవ్వు
ఇకమీదట చెరిగిపోదట
తెలుగువారి ఇల్లంతా
ఒకేవెలుగట, ఆ వెలుంగు

ఇకమీదట ఆరిపోదట

జాతి జాతి పురోగతికి

ఒకే త్రోవట, ఆ త్రోవకి

ఇకమీదట మలుపులేదట

www.vaaradhionline.com

తూరుపుదిక్కున....

తూరుపు దిక్కున అదిగో చూడు
పొడిచె వేగుజుక్క

సత్యాహింసల సూర్యోదయమై
నిత్యము కాంతి నిత్యము శాంతి
దేశ దేశ ప్రజ సంతోషించే
వార్తను తెచ్చిన చుక్క
పొడిచె వేగుజుక్క

తరతరాలుగా మానవోత్తములు
పురుషోత్తముడు బుద్ధుడు జీసస్
నరజాతికి చూపించిన త్రోవ
తిరిగే చూపే ఒకే ఒక్క చుక్క
పొడిచె వేగుజుక్క

విజయీభవ....

విజయీభవ, విజయీభవ, విశాలాంధ్ర జననీ
ప్రజలంతా సుఖాలతో బ్రతుకంతా మననీ

ఏనాడో నలుమూలలు ఏలినావు తల్లీ
తొలిప్రొద్దుల కెల్ల నాడు నీవె కల్పవల్లి
ఆ కలిమీ ఆ బలిమీ నేడు చూపు మళ్ళీ

జీవనదుల తోయముతో నీ చేనులు పండనీ
పంటలతో పశువులతో నాడంతా నిండనీ
నీ పాపలు నీ పిల్లలు కలకాలము నవ్వనీ
ఆగక కొనసాగుమ అమ్మా ఆంధ్రావనీ

భుజబలమూ బుద్ధిబలము నిజపుత్రులకిమ్మా
విజయములో వినయముతో మేముండెదమమ్మా
నీ పేరును ప్రపంచాన నిలిపెదమోయమ్మా
మా రాష్ట్రము దేశానికి తలమానికమమ్మా

ఇన్నాళ్లకు మానవుడే....

ఇన్నాళ్లకు మానవుడే దేవదేవుడు
విన్నారా సామాన్యుడు ఆదిదేవుడు

తన పలుకే నవవేదం
తన కరుణే సుధారసం
మనిషిలోని మంచితనం
ఎన్నటికీ పోని ధనం

చివురించే సమధర్మం
జీవనమే పానము
స్పందించే ప్రతిహృదయం
సర్వేశుని ఆలయమే

ఇన్నాళ్లకు మానవుడే దేవదేవుడు
విన్నారా సామాన్యుడు ఆదిదేవుడు

నిరంతరం....

నిరంతరం మా హృదంతరంలో
నిండి వెలుగు జ్యోతీ
అంజలి చేకొనుమా బాపూ
శ్రద్ధాంజలి గైకొనుమా
భయంకర స్వార్థాచ్ఛాదితమై
లయంకర స్పర్థా స్ఫాలితమై
సర్వదేశ ప్రజ సంక్షోభిస్తే
సత్యాహింసల బోధన చేసి
నిరంతరం....

చిరంతన దాస్య పరంపర
తామరతంపర కాగా
తారక మంత్రము దెలిపి
రాటముతో పోరాటము సల్పి
నిరంతరం....

తల్లి భూమి సంసేవయందె నీ
తనువుబాసి అమరత్వమొంది
వెల్లివిరియు చిరునవ్వులతో
పెల్లుబికెడు కరుణా ఝరులతో
నిరంతరం....

పుట్టాడు అమరజీవి....

పుట్టాడు అమరజీవి పొట్టి శ్రీరాములు తుద
ముట్టాయి తెలుగుజాతి తీరని పెనుబాములు
వేయబడిన చోటులోన ఉన్నది మన గొంగలి – తగ
గాయపడిన కోర్కెలతో కుమిలేను జనావళి – నడుము

కట్టాడు త్యాగజీవి పొట్టి శ్రీరాములు చే
పట్టాయి తెలుగుజాతి నోచిన తొలినోములు

మూడుకోట్ల తెలుగువాళ్ళు ముప్పదేండ్లు పోరగా ఇక
ఓడిపోవు వేళలోన ఓర్పు నీళ్ళుకారగా తాను
పట్టాడు మహాదీక్ష పొట్టి శ్రీరాములు జే
కొట్టారు చేతులెత్తి ప్రగతి మార్గగాములు

తెలుగుపాటకి....

తెలుగుపాటకి నేడు కొత్తపల్లవి పాడుమా
తెలుగువాకిట కొత్త రంగవల్లిక చూడుమా

ముక్కోటి జనరాశి కొక్కటే గొంతు
గొంతెత్తి పాడుటే ఇక వారివంతు
బృందగానమున ఆనందమే పల్లవి
అందరూ సుఖపడిన అందమే అనుపల్లవి

కుందనపు చేతులకు గోరింట గోళ్ళు
కొనగోళ్ళ వీణియల మీటె తెనుగుకోడళ్ళు
పగడాల మోవిపై అమృతంపు జల్లు
పెదవి విప్పకపాడె తెలుగుజవరాళ్ళు

ఎందుకింత సంతోషం....

ఎందుకింత సంతోషమో తెలుగువాళ్ళకి
ఏమి కారణమో ఈ తీయని కన్నీళ్ళకి

ఏ వీధి చూచినా ముగ్గుల మయమే
ఏ గడప చూచినా పచ్చతోరణమే
పసిపిల్ల బాలాది ఇంటిల్లిపాదీ
కొత్తబట్టలు కట్టి కులుకుతున్నారహో

ఈరోజు సంక్రాంతి పండుగ కాదే
ఈ రాత్రి దీపావళీ రాత్రి కాదే
రోజురోజల్లా ఎందుకిన్ని వేడుకలు
రేయి రేయంతా ఎందుకిన్ని దీపాలు

కళ్ళకాటుక రేక కాళ్ళపారాణి
మొగలిపువ్వుల వాలుజడ పరిమళాలు
ఏ నోము నోచెదరో తెలుగు కన్నియలు
ఈ దినము సంబరము ఏ పర్వదినము

జాజీరి....

జాజీరి జాజీరి జాజీరి తల్లీ
జాజులువారే నా తెలుగుతల్లీ
జాజీరి జాజీరి మముగన్నతల్లి
జాళువా జాజీరి ఓ కల్పవల్లీ

జాజరపాటలు పాడుతూ నీకు
జాతర చేస్తామో తల్లీ
బాజాభజంత్రీలు మ్రోగగా నీ
బావుటా ఎగరేస్తా మళ్ళీ

జావాసుమత్రా దేశాల
నీ వెలుగు రవ్వలే మెరిశాయి
ఏవాడ చూసినా నీవారలే
మాణిక్యరాసులే కురిశాయి

ద్వారాన వాడని తోరణం
ఏనాడైనా కల్యాణం
తొలినాటి నీ శోభ ఆశించి
తొడిగాము ముంజేత కంకణం

మాతృకాంక్ష....

అడిగింది ఒక తల్లి
ఒక తల్లి అడిగింది
ఇహం పొలిమేరలో
పరం తొలి దారిలో

నిలచి కొడుకుని తలచి
కలచు గుండెలలో
అలలమాదిరి పొంగి
పొరలు ప్రశ్నలతో... అడిగింది ఒక తల్లి
ఒక తల్లి అడిగింది

కబురు అందని చోట
కలలు విరిగిన చోట
అడిగింది ఒక తల్లి
అడిగింది తొల్లి

"మోహనదాసు కులాసాగా ఉన్నాడా?
అయ్యో అమ్మ పోయిందని అన్నాడా?

సీమనించి తిరిగొచ్చాడా?
పెద్ద పరీక్ష ఇచ్చొచ్చాడా?
అందరిలాంటివాడు కాడు అబ్బాయి
అలాగని అసలేకాడు ఆకతాయి

మబ్బు వెనకాతల సూర్యకిరణం మల్లే
గుబురు ఆకులమధ్య మల్లెపూవు మల్లే
అందరికీ అందనివాడు వాడు
వాడిలాంటి వాడు ఇంకోడు లేడు

దివాన్గిరీ చేశాడా? దివాలా తీశాడా?
కుటుంబం పరువు నిలబెట్టేడా?
పెళ్ళాన్ని ఏలుకొంటున్నాడా?
సజావుగా సంసారం చేస్తున్నాడా?"

అడిగింది ఒక తల్లి
ఒక తల్లి అడిగింది
        మేఘాల భూమిలో
        కోరికల కోటలో
నోము పండిన వారు
పూచి మురిసే చోట
        తనువు వీడినవారు
        వేచి వుండే చోట

మృత్యు సీమను నిలచి
కన్నకొడుకుని తలచి
అడిగింది ఒక తల్లి
ఒక తల్లి అడిగింది

"అబ్బాయి ఆడి తప్పనివాడే గానీ
సారాయి తాగననీ, మాంసం ముట్టుకోననీ
సానిళ్ళకు వెళ్ళననీ, చేతిలో చెయ్యివేసి
ప్రమాణం చేశాడు, నిలబెట్టుకొన్నాడా?
మోహనదాసు కెంతమంది సంతానం?
మా కోడలు నింపాదిగా ఉందా?"

అని
తనకు తానే ప్రశ్న
అడిగింది ఒక తల్లి
తనకు తానే వ్యధను
పొందింది ఒక తల్లి

బదులు చెప్పెను ఒకడు
బరువు మాటలతో
భక్తితో, బాధతో
బదులు చెప్పెను ఒకడు

అతడు సామాన్యుడా?

అతడు మాన్యుడు సుమా
అతడు పుట్టిన కడుపు
అవని తీర్చని ఋణము
అతడు మెట్టిన భూమి
అత్యంత పావనము
అడుగడుగునా విఘ్నాలు, ఆశలకు అవాంతరాలు
ఆశయాలకు ఆనకట్టలు, ఆవేశాలకు చన్నీళ్ళు
అభిప్రాయాలకు సంకెళ్ళు, ఆలోచనలకు బేడీలు
ఆదర్శాలకు ఉరిత్రాడు, ఉత్సాహానికి కంట్రోలు
ఉద్రేకాలకి రేషను, ఇహంలో నో వేకెన్సీ
పరంలో నో ఎడ్మిషన్, కళ్లకు కటకటాలు
కనికరానికి కారాగారం, కడుపులోకి కంకర
మా గీతలు వంకర, మా చుట్టూ బానిసత్వం
ఇటువంటి ఇరులలో
ఇటువంటి వ్యధలలో
అడుగు పెట్టెను అతడు
అవని పండెను అపుడు
భయంకర స్వార్థాచ్ఛాదితమై
లయంకర స్వార్థాస్ఖలితమై
సర్వదేశ ప్రజ సంక్షోభిస్తే
సత్యాహింసలు బోధనచేసిన
అతడు సామాన్యుడా?

అతడు మాన్యుడుగాని,
బ్రహ్మదేవుని నాల్గువేదాలు
ధర్మదేవత నాల్గు పాదాలు
సకల మతములలోని సత్యాలు
అతని బోధనచేత నిత్యాలు
అని
భక్తితో, శ్రద్ధతో
బదులు చెప్పెను ఒకడు
బదులు చెప్పెను అతడు
బరువు కన్నులతో
అంతంత మాటలు తనకు
అర్థంకాలేదు కనుక
అడిగింది ఒక తల్లి
అబ్బాయిని గురించి
అడిగింది ఆ తల్లి
అశ్రులు ధరించి
మోహనదాసు బాగున్నాడా అంటే
ఏమేమో చెప్తారీయన
మీరేనా చెప్పండీ స్వామీ
మా వాడు ఎలాగున్నాడీ
మావాడు రాజ్యాలేలక్కర్లేదు
కులాసాగా ఉంటే చాలు

మంచివాడనిపించుకొంటే
అదే నాకు పదివేలు
అని

అడిగింది ఆ తల్లి
గుండె కొట్లాడ
అడిగింది అడిగింది
ఆత్రం తోడ

మొరడు గుండెలు వాడు
మూర్ఖచిత్తము వాడు
పలుకు విషము లొలుక
బదులు చెప్పెను ఒకడు

మీవాడా? ఛండాలుడు
మీవాడా? దుర్మార్గుడు
మాలవాళ్ళని మాతోపాటు కూర్చోమన్నాడు
భోంచెయ్యమన్నాడు, ఇంకా ఏం చెయ్యమనలేదూ!

పవిత్రమైన దేవాలయాల్లో
అంటరాని వాళ్ళను అంటగట్టేడు
తురకాళ్ళతో భుజం భుజం కలిపి
తుంటరులను వెనకేసుకొని
తూలిపడ్డాడు
చెయ్యరానివెన్నో చేశాడు

అందుకే అన్నిసార్లు జైయిల్లో పెట్టారు
అందుకే ఆఖరిసారి మనవాడే మీవాణ్ణి
గుండేసి కాల్చి చంపేశాడు
మీవాడు దుర్మార్గుడు
మీవాడు పాపాత్ముడు
"ఓరి పాపాత్ముడా అతడు పాపాత్ముడా?
మహాత్ముడు పుణ్యరాశి"
అని సకల జీవరాశి
ఎలుగెత్తి పలికింది
కుమిలిపోయెడి ఆ తల్లి
నూరట పరిచింది

అడిగింది ఆ తల్లి
అపుడు వేదన తోడ
ఈ భూమి మరణించు వారల సీమ
అయినచో అబ్బాయి కానరాడేల

అనుచు దుఃఖముతోడ
అడిగింది ఆ తల్లి
అడిగింది అడిగింది
అబ్బాయి జాడ

తన జాతి గుండెలో
తన జాతి ఇండ్లలో

నిరతమూ నిలచేటి
నిండి వెలిగేటి అతడు
అమరుడు కదా అతడు
నిత్యుడు సుమా
అతని
నిలయము ఎప్పుడూ
అక్కడే
అతని మనుగడ ఎప్పుడూ
ఇప్పుడే

అని చరిత్ర సమాధానం ఇచ్చింది.

www.vaaradhionline.com

తేనెకన్న మధురం....

తేనెకన్న మధురంగా తెలుగు – ఆ
తెలుగుదనం మాకంటి వెలుగు.

తెలుగుగడ్డ పోతుగడ్డ ఎంతపచ్చన మా
తెలుగు గుండెలో స్నేహం ఎంత వెచ్చన
మన పొలాల శాంతి పులుగు ఎంత తెల్లన – మన
తరతరాల కథను పాడు – గుండె ఝల్లన. ॥తే॥

పాటుపడినవాళ్లకే లోటు లేదని
చాటి చెప్పు తల్లికదా తెలుగుతల్లి
లలితకళలు సంగీతం సాహిత్యం
తెలుగుతల్లి జీవితాన దినకృత్యాలు ॥తే॥

గతచరిత్ర ఘనచరిత్ర ఎంత ఖ్యాతి
గర్వించతగ్గ జాతి తెలుగు జాతి
అయినా గతంకన్న భవిష్యత్తు ఆశాజనకం
ఆ భావికొరకు ధరించాలి దీక్షా తిలకం ॥తే॥

ఆలపించు....

ఆలపించు సమైక్య భారతగీతి
ఆరిపోనీకు ఆశాజ్యోతి
భరతమాత సంతానం ఒకటే జాతి
మతాతీత రాజ్యాంగం మన లౌకికగీతి ॥ఆ॥

స్వరాజ్యం తెచ్చారు మునుపు త్యాగధనులు
సురాజ్యం నిలుపరేల ఇప్పటి ఘనులు
స్వాతంత్ర్యం ఉద్భవించి నాటి అర్ధరాత్రి
సమభావం పెంచమంది మన జనయిత్రి ॥ఆ॥

కులాల మతాల కుమ్ములాట చాలు
జలాల పంపకాల తగాదాలు చాలు
సముద్రాల పాలయ్యే జీవజలాలు
సమంగా వాడుకుంటే పండిన కలలు ॥ఆ॥

వెనుకబడిన వారిని ముందుకు తెద్దాం
విమలమైన భవిష్యత్తు తలుపులు తీద్దాం
తరతమ భేదాలన్నీ విస్మరించుదాం
సామ్యసంఘ స్థాపనకై సదాచరిద్దాం ॥ఆ॥

స్త్రీ శక్తి ప్రచురణలు

కె. రామలక్ష్మి రచనలు

నన్ను వెళ్లిపోనీరా (నవల)	1992
అన్నల్లారా నా తప్పేమిటి? (నవల)	1996
హేమ (నవల)	2001
కస్తూరి (నవల)	2001
ఓ తండ్రి కథ (నవల)	2003
కృష్ణార్పణమ్ (నవల)	2006
ద్రౌపది (నవల)	2006
ఒక జీవికి స్వేచ్ఛ (కథలు)	2007
అద్దం (కథలు)	2007

వి.ఎ.కె. రంగారావు రచన

Homage to Arudra

ఆరుద్ర రచనలు

అమెరికా ఇంటింటి పద్యాలు (కవితలు)	1999
శుద్ధ మధ్యాక్కరలు (కవితలు)	1999
కాటమరాజుకథ (నాటకం)	1999
హస్తలక్షణ పదాలు (పదాలు)	1999
అరబ్బీ మురబ్బాలు (కవితలు)	1999
గాయాలు గేయాలు (గీతాలు)	2007

విజయలక్ష్మి రామకృష్ణన్ రచనలు

విజయలక్ష్మి రామకృష్ణన్ చిన్నకథలు	2001
విజయలక్ష్మి రామకృష్ణన్ సిరుకథైగళ్ (తమిళం)	2001

ఇందిర కొల్లి రచనలు

జీవిత కోణాలు	1991
ఇందిర కవితలు	2005
ఆశ నా ఆధారరేఖ (కవితలు)	2007

రాబోయేవి :

ఆంధ్ర కవి సప్తశతి (బులుసు వెంకటరమణయ్య)

సమగ్రాంధ్ర సాహిత్యం – సూచిక

శృంగార చాతుర్య పద్య మంజరి (కావ్యాల నుండి సేకరణ) – ఆరుద్ర

www.vaaradhionline.com